ప్రేమతో మాట్లాడు
ఆలోచించి మాట్లాడు
అర్థం చేసుకొని మాట్లాడు
మంచి మాట్లాడు
తెలివిగా మాట్లాడు
నవ్వుతూ మాట్లాడు
మనస్సు విప్పి మాట్లాడు
పూర్తిగా విన్న తరువాత మాట్లాడు
మనస్సు నొప్పించకుండా మాట్లాడు
తక్కువ మాట్లాడు

TGTEL/25/A1132

మానవాళికి
# జనం వార్త
ప్రతి అక్షరం.. జనం కోసం..


'జనం వార్త'
మీ వ్యాపార, ఉద్యోగ, రాజకీయ, వివాహ, జన్మదిన తదితర ప్రకటనల కోసం సంప్రదించండి...
సెల్ : 8522 055 889

మేడ్చల్ | శనివారం | 27.06.2026 | సంపుటి : 1 | సంచిక : 347 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్: దూసరి రవీందర్ గౌడ్

# వెనెజువెలాలో భూకంపం..
# 920కి చేరిన మరణాలు

## క్రమంగా పెరుగుతోన్న మృతుల సంఖ్య

ఇంకా దొరకని 40వేల మంది ఆచూకీ

భవన శిథిలాల కింద అనేక మంది!?

వెనెజువెల వ్యాప్తంగా తీవ్ర విధ్వంసం

సహాయం కోసం ముందుకొచ్చిన దేశాలు

**వెనెజువెలాలో భూకంపం పెను విషాదం నింపింది. ఈ భూ విలయం సృష్టించిన విధ్వంసంలో మృతుల సంఖ్య 920కి పెరిగింది. గాయపడిన వారి సంఖ్య 3 వేలు దాటింది. ఈ మేరకు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ వివరాలను వెల్లడించారు. అత్యంత తీవ్రంగా దెబ్బతిన్న లా గువేరా ప్రావిన్సులో సహాయక చర్యల కోసం సైనికులను మోహరిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు శిథిలాల కింద వందలాది మంది చిక్కుకుపోయినట్లు అక్కడి ప్రభుత్వం అంచనా వేస్తోంది. గల్లంతైన వారి వివరాలను సేకరించేందుకు ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో ఇప్పటివరకు దాదాపు 50 వేల మంది పేర్లు నమోదైనట్లు సమాచారం. లా గువేరా నగరంలోనే దాదాపు 100కుపైగా భారీ భవనాలు నేలమట్టమైనట్లు అంచనా.**



కారకాస్, జూన్ 26 : దక్షిణ అమెరికా దేశమైన వెనెజువెలాను భారీ భూకంపాలు వణికించాయి. సెకన్ల వ్యవధిలో సంభవించిన రెండు శక్తిమంతమైన భూప్రకంపనలతో దేశవ్యాప్తంగా తీవ్ర విధ్వంసం చోటుచేసుకుంది. ఈ ప్రకృతి విపత్తులో మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇప్పటివరకు 920మంది మృతి చెందినట్లు వెనెజువెలా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. మరో 3 వేల మంది గాయపడినట్లు తెలిపింది. అనేక మంది భవన శిథిలాల కింద చిక్కుకుపోవడంతో సహాయక బృందాలు వారిని వెలికితీసేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నాయి. అధికారుల సమాచారం ప్రకారం, ఈ వరుస భూకంపాల అనంతరం దాదాపు 40 వేల మంది ఆచూకీ తెలియడం లేదు. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన

-మిగతా 2 లో..




# హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

## దేశంలోనే సరికొత్త అధ్యాయానికి నాంది

1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ నగరం

వికారాబాద్ జిల్లా చేవెళ్ల త్వరలో ఏర్పాటు

సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్టుకు వేదిక కాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా, కేవలం డేటా సెంటర్ల కోసమే ఒక పూర్తి 'డేటా సెంటర్ నగరాన్ని' అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఈ ప్రాజెక్ట్ దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది.**

హైదరాబాద్, జూన్ 26 : హైదరాబాద్‌కు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో దాదాపు 1,500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ అత్యాధునిక డేటా సెంటర్ నగరాన్ని నిర్మించనున్నారు. డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు ఉండే భవనాలు మాత్రమే కాదు. వాటిలో వేలాది హై-ఎండ్ సర్వర్లు ఉంటాయి. వాటిని నిరంతరం రన్ చేయడానికి, సురక్షితంగా ఉంచడానికి విస్తృతమైన శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ పరికరాలు, భవిష్యత్ విస్తరణకు భారీ స్థలం అవసరం. అందుకే ఈ ప్రాజెక్ట్ కోసం 1,500 ఎకరాల భూమిని కేటాయించారు. డేటా సెంటర్ సిటీలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలకు ప్రత్యేక మౌలిక వసతులు

-మిగతా 2 లో..




## వేల మంది సైన్యానికి ఇమామ్ ఎదురు నిలిచారు

ఇమామ్ త్యాగాన్ని స్మరించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ




## ఒక్క రాత్రే రష్యాపైకి 660 డ్రోన్లు

ఉక్రెయిన్ భీకర దాడి




## అయోధ్య దొంగతనం కేసులో కీలక మలుపు!

ట్రస్ట్ ప్రధాన కార్యదర్శులు రాజీనామా !

# మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై సమీక్ష



హైదరాబాద్, జూన్ 26 : మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి మూసీ రివర్ ఫ్రంట్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. మూసీ మొదటి దశ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. భూసేకరణ కోసం ఆసక్తిగా ఉన్న వారికి టీడీఆర్ లేదా పరిహారం చెల్లించాలని రేవంత్ చెప్పారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం తీసుకుంటున్న రక్షణ శాఖ భూముల్లో ఉన్న కార్యాలయాలను రాష్ట్ర ప్రభుత్వమే తరలించాలన్నారు. ప్రజల సందర్శన కోసం నెక్లెస్ రోడ్డులో మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూసీ

-మిగతా 2 లో..



# తెలంగాణకు భారీ వర్షసూచన

## అరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ

హైదరాబాద్,జూన్26 : తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది. జూన్ 27వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రానున్న రెండు రోజుల్లో హైదరాబాద్ నగరంలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. వర్షంతో పాటు ఉరుములు, మెరుపులు

-మిగతా 2 లో..

# తులం బంగారం కాదు.. ఇనుము కూడా ఇవ్వరు

కాంగ్రెస్ పాలనలో ప్రజలకు నరకం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



పరిగి, జూన్ 26 : ఆరు గ్యారంటీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కొత్తగా పథకా లేవీ తేలేదన్నారు. రూ.12వేల కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని.. విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పిన రేవంత్.. కనీసం లక్షాధికారులను చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వదని ఎద్దేవా చేశారు. 'మోసపోతే గోస పడుతామని పరిగి గడ్డపై నిలబడి కేసీఆర్ ఆనాడే చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు నరకం చూస్తున్నారు'అని కె. తారక రామారావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగిలో 'సర్'పై నిర్వహించిన శిక్షణ,

-మిగతా 2 లో..



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 251 (కిలో) |
| స్కిన్ లెస్ | 284 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹88

# రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

## సిఎంఓ నుంచి అజిత్ రెడ్డి ఔట్

కొత్తగా ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా నియామకం

సిఎంఓ ముఖ్య కార్యదర్శిగా శ్రీధర్

హైదరాబాద్, జూన్ 26 : తెలంగాణ రాష్ట్ర పాలనా విభాగంలో ప్రభుత్వం పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చేపట్టింది. పరిపాలనను మరింత వేగవంతం చేసే దిశగా కీలక నిర్ణయం తీసుకుంటూ ఒకేసారి 13 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ తాజా బదిలీలలో భాగంగా ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శిగా సీనియర్

-మిగతా 2 లో..







# ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చు

## సర్ ప్రక్రియపై ఈసీ కీలక ప్రకటన

న్యూఢిల్లీ, జూన్ 26 : తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. జులై 24వ తేదీ వరకు దీనిని నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియల భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందిస్తున్నారు. ఓటర్లు వీటికి

-మిగతా 2 లో..

# అప్పు తిరిగివ్వాలని అడిగినందుకే హత్యలు

## నల్లగొండ నలుగురి హత్యకేసులో వీడిన మిస్టరీ

**నల్గొండలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. దంపతులతో పాటు ఇద్దరు పిల్లలను చంపింది ఒక్కడేనని నిర్ధరించారు. ఇటీవల నల్గొండ తెలంగాణ కాలనీలోని ఇంట్లో భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్ (45), హసీనా (38)తో పాటు వారి కుమారుడు ముజామిల్ (20), కుమార్తె అఫోరా (14) హత్యకు గురైన సంగతి తెలిసిందే.**



# తులం బంగారం కాదు.. తులం ఇనుము కూడా ఇవ్వరు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ రైతులకు పట్టాలిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్.. ఇప్పుడు పారిశ్రామిక పార్కుల పేరిట వేలాది ఎకరాలు లాక్కుంటున్నారని ఆరోపించారు. పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి కనీసం ధాన్యం కూడా పూర్తిగా కొనలేకపోతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరిపోయే దీపం లాంటివారని ఎద్దేవా చేశారు. రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి అరెస్టులు చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తి చేశామని.. కానీ రెండున్నరేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్ నిలదీశారు. ఉద్దండాపూర్ నుంచి గ్రావిటీ ద్వారా వికారాబాద్ జిల్లాకు కాల్వల ద్వారా నీటిని తీసుకురావచ్చని సిద్ధం చేస్తే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు కమీషన్ల, కుటుంబ సంపాదన కోసం రూ. 440 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పక్కన పెట్టారని దుయ్యబట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని.. రైతులకు పరిగితోపాటు కొడంగల్, జిల్లా మొత్తానికి సాగు నీరు అందించే బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పార్టీ నేతలు అనిల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శివనోళ్ల భాస్కర్, రాజిరెడ్డి, సురేందర్, అశోక్‌కుమార్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టులో చేపట్టబోయే పనులు ఇందులో ప్రతిబింబించాలని అన్నారు. ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎండీ నర్సింహారెడ్డి, ఎంఆర్డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌పై పోరాటంలో అందరూ భాగస్వాములే

## ఈ మహమ్మారిని తరిమి కొట్టడంలో కలసి రండి

## ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపు



హైదరాబాద్, జూన్ 26 : సమాజాన్ని నాశనం చేస్తున్న డ్రగ్స్‌పై పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశాన్ని ఇచ్చారు. తెలంగాణను డ్రగ్స్ లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల మహమ్మారి కేవలం ఒక వ్యక్తిని మాత్రమే కాకుండా, వారి కుటుంబాలతో పాటూ మొత్తం సమాజాన్నే నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా యువత ఎల్లప్పుడూ వీటికి దూరంగా ఉండాలని సీఎం హితవు పలికారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, అందుకోసం వారు స్వచ్ఛందంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం చట్టాలు, పోలీసుల చర్యల వల్లే కాకుండా.. ప్రజల్లో సరైన అవగాహన పెంచడం ద్వారానే మాదక ద్రవ్యాల నియంత్రణ పూర్తిగా సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా అక్రమ డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. యువత డ్రగ్స్ వైపు వెళ్లకుండా ఉండేందుకు.. వారిలో సానుకూల ఆలోచనలు, నైతిక విలువలను పెంపొందించడం ఎంతో ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సమాజంలో మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై నిరంతరం అప్రమత్తత పెంచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహమ్మారిని రూపుమాపడానికి అందరం కలిసికట్టుగా చేసే సమిష్టి పోరాటమే శాశ్వత పరిష్కారమని, డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం ప్రతి పౌరుడూ నడుం బిగించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌ల బదిలీ

(మొదటిపేజీ తరువాయి)

ఐఏఎస్ అధికారి ఎన్. శ్రీధర్‌ను నియమించారు. అలాగే ఇప్పటివరకు సీఎంఓలో సేవలందించిన అజిత్‌రెడ్డిని అక్కడి నుంచి బదిలీ చేసి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొత్త బాధ్యతలను అప్పగించారు. జీఏడీ ప్రధాన కార్యదర్శిగా అహ్మద్ నదీమ్ నియమితులు అయ్యారు. ఈ క్రమంలోనే పలువురు సీనియర్ అధికారులకు అదనపు బాధ్యతలను కూడా కేటాయించింది. విపత్తు నిర్వహణ శాఖ ముఖ్య కార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులు కాగా.. ఆయనకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అటవీశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్‌ను నియమించగా.. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. చేనేత, హస్తకళల ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న సవ్యసాచి ఘోష్‌కు ఆ శాఖలోనే మరికొన్ని అదనపు బాధ్యతలను కేటాయించగా.. అదే శాఖకు జాయింట్ సెక్రటరీగా కాత్యాయనీ దేవిని నియమించారు. గనులశాఖ ముఖ్య కార్యదర్శిగా రఘునందన్‌రావుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే.. హెచ్ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కె. చంద్రకళను, తెలంగాణ రెడ్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ముషారఫ్ అలీని నియమించారు. ఆర్అండ్‌బీ స్పెషల్ సెక్రటరీగా గంగాధర్‌కు బాధ్యతలు అప్పగించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త కమిషనర్‌గా టి.వెంకన్నను నియమించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి అత్యంత కీలకమైన టూరిజం డైరెక్టర్‌గా కె.విద్యాసాగర్‌ను నియమించారు. తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 30న పదవీ విరమణ చేయనున్న సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును ముఖ్యమంత్రికి అడ్వైజర్ / ఎక్స్-అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఆర్టీ నెం. 912 జారీ చేసింది. పరిపాలనలో ఆయనకున్న సుదీర్ఘ అనుభవాన్ని వినియోగించుకునేందుకు రిటైర్మెంట్ రోజే ప్రభుత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకానికి సంబంధించిన నిబంధనలు, షరతులను విడిగా జారీ చేస్తామని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

# వెనెజువెలాలో భూకంపం.. 920కి చేరిన మరణాలు

(మొదటిపేజీ తరువాయి)



వ్యక్తమవుతోంది. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. రాజధాని కారకాస్‌తో పాటు దేశంలోని పలు ప్రధాన నగరాల్లో భూప్రకంపనలు సంభవించినప్పటికీ, తీర ప్రాంత నగరమైన లా గువేరాలో అత్యధిక నష్టం వాటిల్లింది. భూకంపం ధాటికి అక్కడి పరిస్థితి దయనీయంగా మారింది. ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల వివరాల ప్రకారం, లా గువేరాలో 100కు పైగా భవనాలు పూర్తిగా కూలిపోయాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించడం, వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం అత్యంత క్లిష్టంగా మారిందని వారు తెలిపారు. భారీ కాంక్రీట్ శిథిలాలను తొలగించేందుకు ప్రత్యేక యంత్రాలను వినియోగిస్తున్నట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా సుమారు 250 బహుళ అంతస్తుల భవనాలు పూర్తిగా నేలమట్టమైనట్లు వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్స్ తెలిపారు. సహాయక చర్యలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని శాఖలను అప్రమత్తం చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విపత్తు సమయంలో తమ దేశానికి అండగా నిలిచిన ప్రపంచ దేశాలకు డెల్సీ రోడ్రిగ్స్ కృతజ్ఞతలు తెలిపారు. మానవతా దృక్పథంతో సహాయక చర్యల్లో భాగస్వాములవుతున్న అన్ని దేశాలకు వెనెజువెలా ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ప్రపంచ దేశాలు చూపుతున్న సంఘీభావం తమకు ఎంతో ధైర్యాన్ని ఇస్తోందని ఆమె అన్నారు. భూకంపం అనంతరం సమాచార మార్పిడిని వేగవంతం చేయాల్సిన అవసరాన్ని గుర్తించిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధులు, సామాజిక మాధ్యమాలపై ఉన్న ఆంక్షలను తొలగించాలని వెనెజువెలా ప్రభుత్వాన్ని కోరారు. అత్యవసర సమాచారాన్ని ప్రజలకు త్వరగా చేరవేయడంలో సోషల్ మీడియా కీలక పాత్ర పోషిస్తుందని సూచించారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో వెనెజువెలాలో 'ఎక్స్' సామాజిక మాధ్యమ వేదికను మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చింది. 2024లో అప్పటి ప్రభుత్వం ఈ మైక్రోబ్లాగింగ్ వేదికపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, వెనెజువెలాకు అంతర్జాతీయంగా భారీగా సహాయం అందుతోంది. అమెరికా 150 మిలియన్ డాలర్ల విలువైన సహాయక సామగ్రిని పంపనున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం రెండు యుద్ధ నౌకలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లను సిద్ధం చేసినట్లు తెలిపింది. స్పెయిన్, జర్మనీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, నెదర్లాండ్, మెక్సికో, బ్రెజిల్ తదితర దేశాలు కూడా వైద్య బృందాలు, సహాయక సిబ్బంది, అత్యవసర సామగ్రిని పంపేందుకు ముందుకొచ్చాయి. భూకంప ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. శిథిలాల కింద చిక్కుకున్నవారిని సజీవంగా రక్షించేందుకు సహాయక బృందాలు నిరంతరం శ్రమిస్తున్నాయి. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్న ప్రభుత్వం, బాధితులకు అవసరమైన అన్ని విధాల సహాయాన్ని అందించేందుకు చర్యలు చేపడుతోంది.

# హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'

(మొదటిపేజీ తరువాయి)

కల్పించను న్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ కంపెనీల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్-అండ్-ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హై-స్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచినీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కి చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుండి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్‌ల ద్వారా ఈ డేటా సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. కొన్ని సంవత్సరాల క్రితం వరకు డేటా సెంటర్లను కేవలం వెబ్‌సైట్‌లు, సాధారణ క్లౌడ్ స్టోరేజ్ కోసం వాడేవారు. కానీ నేడు జెనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వాడకం విపరీతంగా పెరిగింది. గతంలో ఒకే సర్వర్ ర్యాక్ 5 నుండి 15 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించుకోగా, ప్రస్తుత జీపీయూ-ఆధారిత ఏఐ సిస్టమ్‌లకు 30 నుండి 120 కిలోవాట్ల విద్యుత్ అవసరం అవుతోంది. ఈ భారీ విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి ఈ ప్రాజెక్ట్‌లో కంపెనీలకు నిరంతరాయంగా 'ఓపెన్ యాక్సెస్ పవర్' అందించనున్నారు. హైదరాబాద్ ఇప్పటికే అమెజాన్, మైక్రోసాఫ్ట్, కంట్రోల్‌ఎస్, క్యాపిటాల్యాండ్, ఎస్‌టిటి గ్లోబల్, ఎన్‌టిటి డేటా వంటి దిగ్గజ కంపెనీల డేటా సెంటర్లకు నిలయంగా మారింది. ప్రస్తుతం ఇక్కడ 150 నుండి 200 మెగావాట్ల సామర్థ్యం గల డేటా సెంటర్లు పనిచేస్తుండగా, సుమారు 5 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. అంతేకాకుండా, తెలంగాణలో మరో 11 గిగావాట్లకు పైగా సామర్థ్యం గల ప్రతిపాదిత ప్రాజెక్టుల కోసం అవగాహన ఒప్పందాలు కుదిరాయి. విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని డేటా సెంటర్ సంస్థలకు ఓపెన్ యాక్సెస్ విధానంలో ప్రైవేటు విద్యుత్ ఉత్పత్తి సంస్థల నుంచి నేరుగా విద్యుత్ కొనుగోలు చేసే అవకాశాన్ని కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది. చందనవెల్లి, భారత్ ఫ్యూచర్ సిటీ, ఫ్యాబ్ సిటీ ప్రాంతాలు కూడా డేటా సెంటర్ క్లస్టర్లుగా అభివృద్ధి చెందుతున్నాయి.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా ఐఏఎస్ సంజయ్ జాజు

- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం
- జూన్ 30తో ముగియనున్న రామకృష్ణారావు పదవీ కాలం



**హైదరాబాద్, జూన్ 26 :** తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక్ పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి.సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన.. గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు.సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార-ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి.. ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్స్‌పర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట్ అని భావించారు. అంతేకాకుండా, కేంద్ర నిధుల సాధనలోను, కేంద్ర-రాష్ట్రాల మధ్య పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ మరియు పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురుకాను న్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది. ఒకవైపు ఐటీ విజనరీగా, మరోవైపు కఠినమైన టాస్క్ మాస్టర్‌గా పేరు తెచ్చుకున్న సంజయ్ జాజు.. రాబోయే రోజుల్లో తెలంగాణ బ్యూరోక్రసీని ఏ విధంగా లీడ్ చేస్తారనేది సచివాలయ ఉద్యోగ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

# తెలంగాణకు భారీ వర్షసూచన

(మొదటిపేజీ తరువాయి)

సంభవిస్తాయని తెలిపింది. గంటకు 40?50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీస్తాయని వెల్లడించింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ పేర్కొంది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. హైదరాబాద్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, కరీంనగర్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, యాదాద్రి, రంగారెడ్డి, మేడ్చల్, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.




# ఆన్‌లైన్‌లోనూ నమోదు చేసుకోవచ్చు

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేసిన తర్వాత బీఎల్‌వోలకు అందించాల్సి ఉంటుంది. ఎన్యూమరేషన్ ఫారంలు అందించిన రెండు, మూడు రోజుల తర్వాత బీఎల్‌వోలు మళ్లీ ఇంటింటికి వెళ్లి ఈ ఫారాలను స్వీకరిస్తారు. తెలుగులో కూడా ఈ పత్రాలు ఉంటాయి. దీంతో నిర్లక్ష్యరాస్యులు కూడా సులువుగా అర్థం చేసుకుని ఫారం నింపవచ్చు. ప్రతీ రోజు 50 ఇళ్లకు వెళ్లి బీఎల్‌వోలు ఈ దరఖాస్తులను అందించాల్సి ఉంటుంది. గుడవు తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్‌వోలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులు చూస్తున్నారు. ఎలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెలంగాణలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికి బీఎల్‌వోలు అందించాలి. అనతరం ఓటర్లు వాటిని పూర్తి చేసి తిరిగి అందించాలి. బీఎల్‌వోలు తీసుకోకపోతే ఈసీ టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జులై 24వ తేదీలోపు వీటిని ఓటర్లందరూ అందించాల్సి ఉంటుంది. అయితే ఆఫ్‌లైన్‌లోనే కాకుండా ఆన్‌లైన్‌లో కూడా ఎన్యూమరేషన్ ఫారం నింపవచ్చు. ఈ విషయం చాలామందికి తెలియక ఆన్‌లైన్ సౌకర్యం ఉపయోగించుకోలేకపోతున్నారు. ఎమ్యూనరేషన్ పత్రాలను ఈసీ వెబ్‌సైట్ ద్వారా సమర్పించవచ్చు. మొబైల్ నెంబర్ ద్వారా ఓటీపీతో లాగిన్ అయ్యి సులువుగా ఫారం నింపవచ్చు. ఆఫ్‌లైన్ లేదా ఆన్లైన్.. ఈ రెండిటిల్లో ఏ విధానం ద్వారా అయినా సమర్పించవచ్చు.

# మొహర్రం వేడుకల్లో విషాదం

## విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతి

**భోపాల్,జూన్26 :** మధ్యప్రదేశ్‌లో దారుణం జరిగింది. మొహర్రం సందర్భంగా ఏర్పాటు చేసిన తజియా.. హైటెన్షన్ వైర్లకు తగలడం వల్ల విద్యుత్ షాక్‌తో ముగ్గురు మరణించారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ ఘటన రాట్లం జిల్లాలోని హత్నారా గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. హత్నారా గ్రామంలో శుక్రవారం మొహర్రం సందర్భంగా తజియా ఊరేగింపు జరిగింది. తజియా చాలా ఎత్తుగా ఉంది. ఈ తజియాతో మొహర్రం ఊరేగింపు నిర్వహిస్తుండగా పైన ఉన్న 11 కేవీ హైటెన్షన్ వైర్లను తగిలింది. తజియా పైభాగం ఆ వైర్లను తగలడం వల్ల దీన్ని తీసుకెళ్తున్న 12 మందికి విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనతో అక్కడ గందరగోళ, భయానక వాతావరణం ఏర్పడింది. ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు, స్థానిక అధికారులు విద్యుత్ షాక్‌కు గురైన 12 మందిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ముగ్గురు మరణించినట్లు వైద్యులు తెలిపారు. ముగ్గురు మృతులను రషీద్ ఖాన్, సద్దు హుస్సేన్, అర్బాజ్ ఖాన్‌గా గుర్తించారు. గాయపడ్డ తొమ్మిది మందికి రాట్లం మెడికల్ కాలేజీలో చికిత్స అందుతోంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, ఈ ప్రమాదంపై స్థానిక ప్రజలు, ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపిస్తు?న్నారు. ప్రతి ఏడాది గ్రామంలో ఇదే మార్గంలో మొహర్రం తజియా వెళ్తుందని, ఈ సమయంలో విద్యుత్ అధికారులు విద్యుత్ నిలిపివేస్తారని, సిబ్బంది కూడా తమతోనే ఉంటారని చెప్పారు. ఈ ఏడాది కూడా విద్యుత్ సిబ్బంది తమతోనే ఉన్నారని, కానీ, విద్యుత్ సరఫరా నిలిపివేయలేదని, అందువల్లే ప్రమాదం జరిగిందని ఆరోపిస్తున్నారు. స్థానిక ప్రజలు కూడా దీనిపై స్పందించారు. ప్రమాదకరమైన విద్యుత్ తీగలు గ్రామం మధ్య నుంచి వెళ్తున్నాయని, అందులోనూ అవి చాలా తక్కువ ఎత్తులో ఉన్నాయని విమర్శిస్తున్నారు. కొన్నిసార్లు బస్సులు, ఇతర వాహనాలు వెళ్లేందుకు కూడా వీటివల్ల ఇబ్బంది పడుతున్నామని తెలిపారు.

# డ్రగ్స్ రహిత తెలంగాణ మా లక్ష్యం

**డ్రగ్స్‌పై పోరాటంలో ఈగిల్ ఫోర్స్ కృషి అసామాన్యం**
**డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలి**
**ఈగిల్ ఫోర్స్ డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భట్టి**




**హైదరాబాద్, జూన్ 26 :** విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్‌కు ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకునే తల్లిదండ్రుల ఆశ, రాష్ట్ర ప్రభుత్వ కల ఒక్కటేనని.. అది యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండటమేనని ఉద్ఘాటించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారు. ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు. ఈగల్ ఫోర్స్ సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించాం. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటాం. తెలంగాణలో పుట్టిపెరగడం ఓ భరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నాం. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యం. సినీ నటులు ఇచ్చే సందేశం సమాజంలోకి బలంగా వెళుతుందని భట్టి విక్రమార్క అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రాణాలకు తెగించి, నిరంతరం రిస్క్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే అలాంటి ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని నమ్ముతూ, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక అవేర్‌నెస్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ బలోపేతం, రాష్ట్ర రక్షణ విషయాలలో ప్రభుత్వం ఎంతో కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. డ్రగ్స్ రవాణా లేదా వినియోగంలో ఎంతటి పెద్దవారు, ఎంతటి ప్రభావశీలురు ఉన్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని భట్టి విక్రమార్క తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చలనచిత్ర రంగానికి చెందిన హీరోలు, హీరోయిన్లు, ఇతర కళాకారులు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని శిల్పకళా వేదిక నుంచి ఆయన విజ్ఞప్తి చేశారు.

## వేల మంది సైన్యానికి ఇమామ్ ఎదురు నిలిచారు

**ఇమామ్ త్యాగాన్ని స్మరించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ**



**న్యూఢిల్లీ, జూన్ 26 :** మొహర్రం పవిత్ర మాసం సందర్భంగా.. సత్యం, ధర్మం కోసం హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన అత్యున్నత త్యాగాన్ని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్మరించుకున్నారు. ఈ మేరకు ఆయన తన అధికారిక సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ (గతంలో ట్విట్టర్) ద్వారా ఒక సందేశాన్ని పంచుకున్నారు. "హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన త్యాగం... సత్యం, న్యాయం కోసం స్థిరంగా పోరాడేలా ఎంతో మందికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది. ఇది అచంచలమైన ధైర్యం, విశ్వాసానికి సజీవ ప్రతీకగా నిలుస్తుంది" అని ప్రధాని మోదీ తెలిపారు. స్లాం మత ప్రవక్త అయిన మహమ్మద్ ప్రవక్త మనవడే (కూతురు ఫాతిమా, అల్లుడు అలీల కుమారుడు) హజ్రత్ ఇమామ్ హుస్సేన్. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం మొదటి నెల అయిన మొహర్రంలో 10వ రోజును 'ఆషూరా' ( అని పిలుస్తారు. ఈ రోజున షియా ముస్లింలు ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరుల అమరత్వాన్ని స్మరించుకుంటూ, దీనిని అత్యంత విషాద దినంగా పాటిస్తారు. క్రీస్తుశకం 680 (హిజ్రీ సంవత్సరం 61)లో ప్రస్తుత ఇరాక్ దేశంలోని 'కర్బలా' అనే ప్రాంతంలో జరిగిన చారిత్రాత్మక యుద్ధంలో ఈ మహా త్యాగం జరిగింది. ఆ సమయంలో ఉమయ్యద్ రాజవంశానికి చెందిన పాలకుడు యజీద్ , తనను ఇస్లామిక్ సామ్రాజ్యానికి ఏకైక నాయకుడిగా (ఖలీఫాగా) అందరూ అంగీకరించాలని డిమాండ్ చేశాడు. అయితే, యజీద్ ఒక క్రూరుడు, అవినీతిపరుడు, ఇస్లాం ప్రాథమిక, నైతిక సూత్రాలకు విరుద్ధంగా పాలించేవాడు. ఆయన పాలనను అంగీకరిస్తే, అది సత్యం, ధర్మాన్ని కాలరాయడమే అవుతుందని ఇమామ్ హుస్సేన్ దృఢంగా భావించారని ఎన్‌సైక్లోపీడియా బ్రిటానికా లోని ఇస్లామిక్ హిస్టరీ అండ్ బ్యాటిల్ ఆఫ్ కర్బలా చెబుతోంది. అధికార దాహంతో ఉన్న యజీద్‌కు లొంగిపోవడానికి నిరాకరించిన ఇమామ్ హుస్సేన్, కేవలం 72 మంది కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి యజీద్ పంపిన వేల మంది సైన్యంతో కర్బలా మైదానంలో ఎదురునిలిచారు. ఆ చిన్న సమూహంలో 6 నెలల పసికందుతో పాటు మహిళలు, వృద్ధులు కూడా ఉన్నారు. శత్రువులు వారి దారుణత్వాన్ని ప్రదర్శిస్తూ, యూఫ్రటీస్ నది నుంచి ఇమామ్ హుస్సేన్ బృందానికి చుక్క నీరు కూడా అందకుండా మూడు రోజుల పాటు అడ్డుకున్నారు. మండుటెండలో దాహంతో అలమటిస్తున్నప్పటికీ వారు ధర్మాన్ని వీడలేదు. చివరగా, ఆషూరా రోజున జరిగిన అసమాన పోరులో హజ్రత్ ఇమామ్ హుస్సేన్, ఆయన అనుచరులు అత్యంత దారుణంగా, వీరోచితంగా పోరాడి ప్రాణత్యాగం చేశారు.

## నేడు వరంగల్‌లో జాబ్ మేళా

**5 వేల ఉద్యోగాల భర్తీకి అవకాశం**

**వరంగల్, జూన్ 26 :** నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 27న వరంగల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో 'వరంగల్ కౌశల్ మహోత్సవ్' పేరుతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్‌లోని కాకతీయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (కిట్స్) కళాశాల ప్రాంగణంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా ప్రారంభం కానుందని, ప్రముఖ ప్రైవేట్ సంస్థలు పాల్గొని సుమారు 5 వేల ఉద్యోగాల భర్తీ చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, విద్యార్హతల ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు పొందాలని కోరారు. ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఈ మేళా మంచి అవకాశంగా నిలవనుందని పేరొన్నారు.

## అయోధ్య నిధుల గోల్‌మాల్‌పై జవాబివ్వండి

**200కోట్ల అవినీతిపై ప్రజలకు సమాధానం చెప్పాలి**
**భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్**



**హైదరాబాద్, జూన్ 26 :** అయోధ్య రామ జన్మభూమి ట్రస్ట్ పేరుతో రూ.200 కోట్లు అవినీతి చేశారని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపణలు చేశారు. రాముడి పేరు చెప్పి వసూలు చేసిన డబ్బుతో ఏం చేస్తున్నారో బీజేపీ ప్రజలకు చెప్పాలన్నారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ విరాళాల అవకతవకలపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి స్పందించారు. అయోధ్య రామ జన్మభూమి తీర్థ ట్రస్ట్‌కు సంబంధించి ఎలాంటి అవినీతి జరగలేదని కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారని.. కానీ యూపీ సిట్ పోలీసులు చంపత్ రాయ్ మనుషులను అరెస్టు చేశారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజల సెంటిమెంట్‌ను అడ్డం పెట్టుకుని విరాళాలు వసూలు చేశారని అన్నారు. చంపత్ రాయ్‌ను ట్రస్ట్ కార్యదర్శి పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. యూపీ సీఎం పదవికి యోగీ ఆదిత్య నాథ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇది యూపీకి సంబంధించిన వ్యవహారం కాదని.. దేశ ప్రజలకు సంబంధించిన అంశమన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ఎంపీలు 20 మందిని, మహారాష్ట్రలో శివసేన ఉద్దవ్ థాక్రే ఎంపీలు 6 మందిని.. ఒక్కొక్కరికీ రూ.75 కోట్లు ఇచ్చి బీజేపీ కొనుగోలు చేసిందంటూ వ్యాఖ్యానించారు. రామ జన్మభూమి ట్రస్ట్ అవినీతి వ్యవహారంలో ప్రధాని మోదీ, అమిత్ షా, యోగీ ఆదిత్య నాథ్ ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాను పదవి నుంచి తప్పించి చేతులు దులుపుకుంటే సరిపోదన్నారు. దేశంలో ప్రజలు ఏ స్థితిలో ఉన్నా అయోధ్య రామ మందిరం నిర్మాణం కోసం విరాళాలు ఇచ్చారన్నారు. 'ప్రజలు దేవుడి కోసం డబ్బులు ఇచ్చారు. మీరు దోచుకోవడం కోసం కాదు' అంటూ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## సనత్‌నగర్ కల్ట్ జిమ్ కేసులో కొత్తకోణం

**జిమ్‌కు వచ్చే మహిళలపై కోచ్ లైంగిక వేధింపులు**

**హైదరాబాద్,జూన్26 :** నగరంలోని సనత్ నగర్ కల్ట్ జిమ్ వేధింపుల ఉదంతంలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గతంలో ఒక పైలట్‌ను వేధించిన కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ఓ మహిళ.. ఇప్పుడు అదే జిమ్‌లో తనను కొందరు తీవ్రంగా వేధిస్తున్నారంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. జిమ్‌లో పరిచయమైన శ్రుతిక అనే మహిళ తనను అసభ్య కార్యకలాపాల్లో పాల్గొనాలని కోరినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. తాను, తన ప్రియుడు నరేష్ నాయుడుతో పాటూ జిమ్ ట్రైనర్లుగా పనిచేస్తున్న చెడిమాల హరీష్, గోపికృష్ణలు గ్రూప్‌గా అసభ్య కార్యాకలాపాల్లో పాల్గొంటామని శ్రుతిక బాధితురాలికి చెప్పింది. ఈ గ్రూప్‌లో చేరడానికి ఆసక్తి ఉందా అంటూ ఆమె అడగడంతో బాధితురాలు తీవ్ర దిగ్భ్రాంతికి గురై, వెంటనే అక్కడి నుంచి వెళ్ళిపోయింది. శ్రుతిక బ్యాచ్‌తో కలవడానికి నిరాకరించడంతో.. ఆ తర్వాత లిఫ్ట్‌లో శ్రుతిక, నరేష్ నాయుడు కలిసి బాధితురాలిని అసభ్య పదజాలంతో దూషించారు. ఆ సమయంలో నరేష్ నాయుడు బాధితురాలి పట్ల అత్యంత అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఎఫ్ఐఆర్ లో నమోదైంది. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని వారు బాధితురాలిని బెదిరించారు. ఈ ఘటన జరిగిన మూడు రోజుల తర్వాత.. జిమ్ బేస్‌మెంట్‌లో ట్రైనర్లు హరీష్, గోపీకృష్ణలు కూడా బాధితురాలిని వేధించినట్లు పోలీసులు గుర్తించారు. వారిలో ఒకరు బాధితురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తించగా.. మరొకరు జుట్టు లాగి హింసించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై సనత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను ఉన్నతాధికారులు ఎస్ఐ అనూషకు అప్పగించారు.

## మరో నాలుగు చెరువుల పునరుద్ధరణ

**107 కోట్లతో చేపట్టిన హైడ్రా**

**హైదరాబాద్, జూన్ 26 :** నగరంలో వరదల కట్టడి, భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీచెరువుల పునరుద్ధరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ. 107 కోట్ల భారీ వ్యయంతో మరో నాలుగు ప్రముఖ చెరువుల అభివృద్ధి పనులను హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ అధికారికంగా ప్రారంభించారు. ఇబ్రహీంపట్నంలోని పెద్ద చెరువు, కాముని చెరువుల వద్ద ఆయన స్వయంగా భూమి పూజ చేసి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ జాబితాలో ఇబ్రహీం పెద్ద చెరువు, భగీరథమ్మ చెరువు, కాముని చెరువు, కాప్రా చెరువులు ఉన్నాయి. మొత్తం 311 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న ఈ నాలుగు చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేశారు. వీటిని కేవలం జలాశయాలుగానే కా కుండా, స్థానికులకు ఆహ్లాదాన్ని పంచే అద్భుతమైన పర్యాటక కేంద్రాలుగా మార్చనున్నారు. ఇందులో భాగంగా చెరువుల చుట్టూ వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు పెద్ద చెరువుల్లో పర్యాటక శాఖ సహకారంతో త్వరలోనే బోటింగ్ వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

## అప్ప అడిగినందుకే హత్యలు

**నల్లగొండ నలుగురి హత్యకేసులో వీడిన మిస్టరీ**

**నల్గొండ, జూన్ 26 :** నల్గొండలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి దారుణ హత్య కేసును పోలీసులు ఛేదించారు. దంపతులతో పాటు ఇద్దరు పిల్లలను చంపింది ఒక్కడేనని నిర్ధరించారు. ఇటీవల నల్గొండ తెలంగాణ కాలనీలోని ఇంట్లో భార్యాభర్తలు మహ్మద్ సుల్తాన్ (45), హసీనా (38)తో పాటు వారి కుమారుడు ముజామిల్ (20), కుమార్తె అఫోర (14) హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈనెల 20న తెల్లవారుజామున హత్యలు జరగ్గా.. 22న ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రధాన నిందితుడు సయ్యద్ అస్లాం, అతడి భార్య తబస్సుమ్‌తో పాటు వారికి పరోక్షంగా సహకరించిన సోహైల్, హేమంత్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మీడియాకు వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్థిక లావాదేవీల కారణంగానే అస్లాం ఘాతుకానికి పాల్పడ్డాడు. అక్క కుమార్తె తబస్సుమ్, అస్లాంకు హసీనా ఏడాది క్రితం రూ.లక్ష అప్పు ఇచ్చారు. ఇటీవల మరో రూ.లక్ష కావాలని సుల్తాన్, హసీనా దంపతులను అస్లాం అడిగాడు. దానికి హసీనా నిరాకరించారు. గతంలో ఇచ్చిన డబ్బు తిరిగివ్వాలని కోరారు. డబ్బు కోసం ఒత్తిడి చేశారని తబస్సుమ్, అస్లాం వారిపై పగ పెంచుకున్నారు. అస్లాం యూట్యూబ్‌లో చూసి హత్యలకు పథకం పన్నాడు. ఈనెల 20 తెల్లవారుజామున ఇంటి నుంచి బయటకు వచ్చిన హసీనాను తొలుత చంపాడు. ఆ తర్వాత అరుపుల శబ్దం విని బయటకు వచ్చిన సుల్తాన్, ముజామిల్‌ను కూడా అంతమొందించాడు. ఇంట్లో ఉన్న అఫోరను కూడా వదల్లేదు. ఇంట్లోకి వెళ్లి మరీ మంచం కింద దాక్కున్న అఫోరను కడతేర్చాడు. ఈ హత్యల తర్వాత ఇంట్లోని నగదు, బంగారు ఆభరణాలను అస్లాం దోచుకెళ్లాడని ఎస్పీ వివరించారు.

## తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తామంటూ మోసం

**గోల్డ్‌మ్యాన్ సూర్యభాయ్‌పై పోలీస్ కేసు**

**హైదరాబాద్, జూన్ 26 :** గోల్డ్ మ్యాన్ సూర్య భాయ్‌పై కేసు నమోదు అయ్యింది. తక్కువ ధరకే బంగారం ఇప్పిస్తానని లక్షల రూపాయలు తీసుకుని మోసం చేశారంటూ ఆరోపణలు రావడంతో సూర్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌లకు సన్నిహితుడి నంటూ నమ్మించాడని, తక్కువ ధరకే విదేశీ బంగారం ఇస్తామంటూ లక్షలాది రూపాయలు వసూలు చేసి మోసగించాడంటూ బాధితులు వాపోయారు. అటు బంగారం ఇవ్వక, డబ్బులు ఇవ్వకపోవడంతో బాధితులు సూర్య భాయ్ ఇంటికి వెళ్లారు. దీంతో తన దగ్గర ఉన్న మూడు ఐఫోన్లను ఇచ్చి వీటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని చెప్పడంతో పాటు రూ.20 లక్షల చెక్ ఇచ్చి పంపించాడు. అయితే, బాధితులు వెళ్లిపోయాక వారిపైనే అత్తాపూర్ పోలీసులకు సూర్య ఫిర్యాదు చేశాడు. తనను బెదిరించి తన ఫోన్లు లాక్కెళ్లారంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై దర్యాప్తు చేసిన పోలీసులు అసలు విషయాన్ని రాబట్టారు. బంగారం కోసం హిమాయత్‌నగర్, నీలోఫర్‌లో సూర్య భాయ్‌కు బాధితులు రూ.30 లక్షలు ఇచ్చినట్లు విచారణలో బయటపడింది. దీంతో అత్తాపూర్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. కేసును నారాయణగూడకు బదిలీ చేశారు.

## అపరేషన్ అమిస్టాడ్

**వెనెజువెలాకు భారత్ ఆపన్నహస్తం**
**రెండు విమానాల్లో సహాయ సామగ్రి**

**న్యూఢిల్లీ,జూన్26 :** భూకంపాలతో అతలాకుతలమైన వెనుజువెలాకు భారత్? ఆపన్నహస్తం అందించింది. ఆపరేషన్? అమిస్టాడ్? పేరుతో ఆ దేశానికి భారీ సహాయక కార్యక్రమాన్ని చేపట్టింది. రెండు వాయుసేన విమానాల్లో సహాయక సామాగ్రి, వైద్యబృందాన్ని పంపింది. ?కు వెనుజువెలాకు సహాయం అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ మిషన్?కు 'ఆపరేషన్? అమిస్టాడ్?' అని నామకరణం చేసినట్లు విదేశాంగ మంత్రి జైశంకర్? ఎక్స్? వేదికగా పేర్కొన్నారు. వెనుజువెలాకు అత్యవసర సాయాన్ని అందించేందుకు, భారత వైమానిక దళానికి చెందిన రెండు జ-17 విమానాలు ఈ రోజు ఆ దేశానికి బయలుదేరాయి. ఈ సహాయక సామగ్రిలో భారత సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్, 35 టన్నులకు పైగా సహాయక సామాగ్రి, మందులు, వైద్య పరికరాలు ఉన్నాయి. ఈ క్లిష్ట సమయంలో వెనిజులా ప్రభుత్వానికి, ప్రజలకు అండగా నిలవడానికి భారతదేశం కట్టుబడి ఉంది" అని జైశంకర్? ఎక్స్? పోస్టులో పేర్కొన్నారు.

## ఒకరికి తెలియకుండా మరొకరితో పెళ్లి

**పలువురిని పెళ్లి పేరుతో మోసం చేసిన యువతి అరెస్ట్**

**అనంతపురం, జూన్ 26 :** ఒకరికి తెలియకుండా మరొకరిని పెళ్లాడుతూ పలువురిని మోసం చేసిన యువతిని అనంతపురం జిల్లా పెదవడుగూరు పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితురాలు వజ్రపు మణి అలియాస్ శ్వేతారెడ్డి అలియాస్ కీర్తి (27)ని మదనపల్లె మండలం చీలకబైలు వద్ద అరెస్ట్ చేసినట్లు పెద్దవడుగూరు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా దొండపూడికి చెందిన నిందితురాలు ఒకరికి తెలియకుండా మరొకరితో.. ఇలా ఐదు పెళ్లిళ్లు చేసుకుంది. విజయవాడకు చెందిన మధ్యవర్తులు సుమప్రియ, అశోక్, శశికళ, రామకృష్ణతో చేతులు కలిపి ఎదురుకట్నం వచ్చేలా పెళ్లి సంబంధాలు కుదుర్చుకునేది. ఒకరితో పెళ్లి తర్వాత వారి వద్ద కొన్ని రోజులు ఉండి స్వస్థలానికి వెళ్లిపోయేది. ఈ క్రమంలో పెద్దవడుగూరు మండలం కాసేపల్లికి చెందిన యాపర్ల సుధీర్‌రెడ్డిని 2025లో వివాహం చేసుకున్న నిత్యపెళ్లికూతురు.. కొద్దిరోజులకే అతడికి చెప్పకుండా మాయమైంది. ఈ ఘటనపై సుధీర్ ఫిర్యాదుతో పెద్దవడుగూరు పీఎస్‌లో కేసు నమోదైంది. ఇటీవల కర్ణాటకలోని మ్లలెకుప్పానికి చెందిన ఓ వ్యక్తిని పెళ్లి చేసుకుని ఆరు రోజుల తర్వాత మదనపల్లె వెళ్తుండగా.. చీకలబైలు వద్ద పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు.



## సీఆర్ పాటిల్‌తో సీఎం ఏం మాట్లాడారో చెప్పాలి

**భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు**

**హైదరాబాద్, జూన్26 :** భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ప్రస్తావించిన ప్రాజెక్టులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, తుంగభద్ర అంశంపై ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించాలని అన్నారు. తెలంగాణకు ఆ రెండు ప్రాజెక్టుల నుంచి 15.9 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉండగా, కేవలం 5 టీఎంసీలే చూపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేశాయని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణకు రావాల్సిన వాటా కంటే తక్కువకు అంగీకరించారని పేర్కొన్నారు. అలాగే ఎస్ఐఆర్‌పై ఓవైసీ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ, భాజపా ఐడీ కార్డు మాత్రమే కాదు, పాస్‌పోర్ట్ వంటి గుర్తింపు పత్రాల చెల్లుబాటుపై ఆయన చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు.

## ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలపై కన్నేయాలి

- ఫీజు రియంబర్స్‌మెంట్ సకాలంలో చెల్లించాల్సిందే
- కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి



**హైదరాబాద్, జూన్ 26 :** విద్యార్థుల నుండి భారీగా ఫీజులు వసూలు చేస్తున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థల తీరుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజులు వసూలు చేసే కాలేజీలు కనీస విద్యా ప్రమాణాలను , వసతులను ఖచ్చితంగా పాటించాలన్నారు. గతంలో విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికల ఆధారంగా, కనీస ప్రమాణాలు పాటించని ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రైవేట్ కాలేజీల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలంటూ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలపై కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు విజయశాంతి స్పందించారు. న్యాయస్థానం ఇచ్చిన ఈ ఆదేశాలను గౌరవించి, వాటిని తూచా తప్పకుండా అమలు చేయాల్సిన కనీస బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని ఆమె స్పష్టం చేశారు. ఫీజుల బకాయిల కారణంగా విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా, వారి విద్యా సంవత్సరానికి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని ఆమె సూచించారు. ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సద్వినియోగం అయ్యేలా, అర్హులైన విద్యార్థులకు తగిన న్యాయం జరిగేలా చూసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజయశాంతి కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులందరికీ మెరుగైన వసతులతో కూడిన, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలని ఆమె ప్రభుత్వానికి హితవు పలికారు.

## రాంగ్‌రూట్‌లో వచ్చిన స్కూటీని ఢీకొన్న బైక్

**స్కూటీపై ఉన్న ఇద్దరు అక్కడిక్కడే మృతి**

**హైదరాబాద్,జూన్26 :** నగరంలోని గచ్చిబౌలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. రాంగ్ రూట్ లో వచ్చిన స్కూటీని.. ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. గచ్చిబౌలిలో ఈ ఘటన చోటు చేసుకుంది. వినోద్ అనే వ్యక్తి శుక్రవారం ఉదయం 7:30 గంటల ప్రాంతంలో తన బైక్‌పై గచ్చిబౌలి నుంచి హాఫీజ్‌పేట్ వైపు వెళ్తున్నారు. అదే సమయంలో హాఫీజ్‌పేట్ నుంచి గచ్చిబౌలి వైపు రాంగ్ రూట్‌లో ఫ్లై ఓవర్ మీదుగా శ్రీకాంత్, విట్టల్ స్కూటీపై వెళ్తున్నారు. ఈ క్రమంలో రెండు వాహనాలు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. స్కూటీపై ప్రయాణిస్తున్న ఇద్దరు మృతిచెందగా.. బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. సమాచారం అందిన వెంటనే గచ్చిబౌలి పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రియుడి ఒత్తిడితోనే కేతన్ హత్య

**పోలీసుల విచారణలో కొత్త విషయం వెల్లడి**

**ముంబై, జూన్ 26 :** పుణె బిజినెస్‌మ్యాన్ కేతన్ అగర్వాల్ మృతి కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. లోహ్‌గఢ్ కోటలో కేతన్‌ను హత్య చేయాలని సియాను ఆమె ప్రియుడు చేతన్ ప్రేరేపించాడని.. లేదంటే జూన్ 14న అతడిని అంతమొందించడానికి ప్రయత్నించిన విషయాన్ని బయటపెడతానని బెదిరించాడని పోలీసులు వెల్లడించారు. ఎ÷-లాన్ ప్రకారం కొండ అంచు వద్దకు చేరుకున్నాక సియా.. అతడికి సంకేతం ఇచ్చిందన్నారు. వెంటనే అక్కడికి చేరుకున్న చేతన్.. కేతన్‌ను వెనక నుంచి తోసేసినట్లు వెల్లడించారు. హత్యకు సియాను ప్రేరేపించడానికి చేతన్ తమ ప్రైవేట్ ఫొటోలు, కాల్ రికార్డింగ్స్ బయటపెడతానని బెదిరించాడా ..? అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుల బ్యాంకు అకౌంట్లను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. హత్యకు ముందు రోజు సియా-చేతన్ ఓ కేఫ్‌లో కూర్చొని మాట్లాడుకుంటున్న సీసీటీవీ దృశ్యాలు దొరికాయి. ఈ కేసులో సియా గోయల్ సోదరుడిని కూడా పోలీసులు విచారిస్తున్నారు.





రోజూ ఉదయం ఓ కప్పు పాలు తాగడం అనేది భారతీయ కుటుంబాల్లో అలవాటు. పిల్లల ఎదుగుదలకు, వృద్ధులు సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారంగా పాలను తీసుకుంటారు. కానీ, ఇప్పుడు అదే పాలు మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నాయి. మార్కెట్లో లభిస్తున్న పాలు ఎంతవరకు స్వచ్ఛమైనవో అనేది పెద్ద ప్రశ్నగా మారింది. వ్యాపారంలో అధిక లాభాల కోసం కొందరు పాల వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో ఆటలు ఆడుతున్నారు. ఆవు లేదా గేదె నుంచి వచ్చిన సహజ పాలను నీటితో కలిపి ఎక్కువ లీటర్లుగా పెంచడం మొదటి దశ. దాంతో ఆ పాలు పల్చగా కనిపిస్తాయి. అలా కాకుండా కొంతమంది లాభాపేక్షపరులు దురాలోచనతో పాలను కల్తీచేసి విక్రయాలు చేస్తున్నారు. యూరియా, డిటర్జెంట్, ఫార్మాలిన్, వాషింగ్ సోడా వంటి రసాయనాలను కలుపుతూ కృతిమ పాలను సృష్టిస్తున్నారు. మార్కెట్లో చిక్కని పాలు ఎక్కువ ధరకు అమ్ముడవుతాయనే కారణంతో కొంతమంది పాల వ్యాపారులు ఈ ప్రయోగాలు చేసి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారు.

- ప్రజా ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్న 'విషంపాలు'
- తెల్లగా కనిపించినవన్నీ నిజమైన పాలు కావు
- తాగే ముందు పరీక్షించండి.. తెలుసుకోండి !
- కల్తీపాలను తయారు చేస్తున్న పాల వ్యాపారులు
- యూరియా, డిటర్జెంట్, స్టార్చ్, ఫార్మాలిన్, వాషింగ్ సోడా వంటి రసాయనాలను కలుపుతూ కృతిమ పాల తయారీ

రోజూ ఉదయం కప్పు పాలు తాగడం అనేది మన భారతీయ కుటుంబాల్లో శతాబ్దాల నాటి అలవాటు. పిల్లల ఎదుగుదలకు, వృద్ధుల ఆరోగ్యానికి పాలు ప్రధాన పోషకాహారంగా భావిస్తారు. కానీ, ఇప్పుడు అదే పాలు మన ఆరోగ్యానికి శత్రువులుగా మారుతున్నాయి. మార్కెట్లో లభిస్తున్న పాలు ఎంతవరకు స్వచ్ఛమైనవో అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ముఖ్యంగా తెల్లగా, మృదువుగా, తీపిగా కనిపించే పాలు... ఆరోగ్యానికి ప్రతీకగా మన రోజువారీ ఆహారంలో ముఖ్య స్థానాన్ని సంపాదించుకున్నాయి. కానీ అదే పాలు ఇప్పుడు మెల్లగా మన ఆరోగ్యాన్ని తినేస్తున్నాయని ఎప్పుడైనా ఆలోచించారా? కల్తీ పాలు అనే పేరు వెనుక దాగి ఉన్న ప్రమాదం ప్రతి ఇంటికి చేరుతోంది.

# పాలల్లో విషం!



## లాభాల కోసం మోసం :

మార్కెట్లో చిక్కని పాలు ఎక్కువ ధరకు అమ్ముడవుతాయనే కారణంతో కొంతమంది పాల వ్యాపారులు వింత ప్రయోగాలు చేస్తున్నారు. వారు మాల్టోడెక్సిన్ పౌడర్, పామ్ ఆయిల్, ఉప్పు లాంటి పదార్థాలను తక్కువ చిక్కదనమున్న పాలలో కలిపి గ్రైండర్లో మిక్సింగ్ చేస్తారు. ఈ ప్రక్రియతో పాలు స్వచ్ఛంగా కనిపిస్తూ, సహజ సుగంధం, చిక్కదనం కలిగినట్లు కనిపిస్తుంది. వాస్తవంగా డైరీలలో పాలలో క్వాలిటిని, చిక్కధనం పరిశీలన నిమిత్తం లాక్టోమీటర్ అనే పరికరంతో పాలు పరీక్షిస్తారు. ఈ మీటర్ ఎంత లోతుగా వెళ్తే అంత చిక్కదనం ఉన్నట్లు భావిస్తారు. కానీ కల్తీ పదార్థాలు కలిపిన పాలు కూడా ఈ పరీక్షలో కొన్నిసార్లు పాస్ అవ్వడంతో అసలు, నకిలీ పాలు మధ్య తేడా పట్టడం కష్టమవుతోంది.



## డిటర్జెంట్ పాడి :

పాలు నురుగుగా కనిపించేందుకు డిటర్జెంట్ పౌడిని కలుపుతారు. ఫార్మాలిన్, పాలు త్వరగా పాడుకాకుండా ఉండేందుకు వాడతారు. ఇది మృతదేహ సంరక్షణ వాడే పదార్థం, ఇక స్టార్చ్ అనేది పాల మందం పెంచేందుకు పిండిపొడి వాడతారు. దీని వల్ల పేగు సంబంధిత వ్యాధులు తలెత్తుతాయి. ఇక పాలలో వాడే మరో రసాయనం వాషింగ్ సోడా పాల తెల్లదనం పెంచుతుంది. దీని ప్రభావం లివర్, కిడ్నీలపై తీవ్రంగా ఉంటుంది.

## ఇంజక్షన్ పాలు - హార్మోన్ల హానికర వాస్తవం

పశువులకు ఎక్కువ పాలు రావాలనే దురాశతో కొందరు ఆక్సిటోసిన్ ఇంజక్షన్లు ఇస్తున్నారు. ఈ ఇంజక్షన్ వల్ల పాలలో మిగిలిన రసాయనాలు నేరుగా మన శరీరంలోకి చేరి కింది సమస్యలకు దారితీస్తాయి. చిన్న పిల్లల్లో హార్మోన్ల అసమ తుల్యత దెబ్బతింటుంది. ఇక మహిళల్లో మాసిక చక్రం లోపాలు, గర్భధారణ సమస్యలు, బాలింతల్లో పాల నాణ్యత తగ్గడం, శిశువుల్లో జీర్ణకోశ, పేగు సమస్యలు కలుగుతాయి.

## ఇంట్లోనే పాలను గుర్తించండి

- నురుగు పరీక్ష పాలను సీసాలో కదిలించండి. నురుగు ఎక్కువ సేపు ఉంటే ఆ పాలు కల్తీ.
- వేడి పాలలో కొన్ని చుక్కల నిమ్మరసం వేయండి. వెంటనే విరిగితే స్వచ్ఛమైన పాలు. ఆలస్యంగా విరిగితే సింథటిక్ కల్తీ పాలు.
- పాలలో అయోడిన్ చుక్కలు వేస్తే నీలం రంగు వస్తే స్టార్చ్ కలిపిన పాలు.
- పారదర్శక గ్లాసులో పాలు పోసి టార్చ్ వెలిగించండి. పాలు పారదర్శకంగా కనబడితే కల్తీ.



## మతం మారినంత మాత్రాన
# రిజర్వేషన్లు వర్తించవు

- ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనవి
- సంచలన తీర్పు వెల్లడించిన మద్రాస్ హైకోర్టు

**మద్రాస్, జూన్ 26 :** మతం మార్పిడులు, రిజర్వేషన్ల ప్రయోజనాలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఇతర వెనుకబడిన వర్గాల నుండి ఇస్లాం మతంలోకి మారిన వారికి "వెనుకబడిన తరగతి ముస్లిం" కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను కల్పిస్తూ తమిళనాడు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వును హైకోర్టు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ పూర్తిగా కొట్టివేసింది. 2024 మార్చి 9న తమిళనాడు ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉత్తర్వును జారీ చేసింది. దీని ప్రకారం... వెనుకబడిన తరగతి ), అత్యంత వెనుకబడిన తరగతి , డినోటిఫైడ్ కమ్యూనిటీస్ ), షెడ్యూల్డ్ కులాల (రాజ)కు చెందిన వ్యక్తులు ఇస్లాం మతంలోకి మారినప్పటికీ, వారు 'బీసీ ముస్లిం' కేటగిరీ కింద రిజర్వేషన్ ప్రయోజనాలను పొందడం కొనసాగించవచ్చని పేర్కొంది. అంతేకాకుండా, ప్రభుత్వం నోటిఫై చేసిన ఏడు ప్రత్యేక బీసీ ముస్లిం వర్గాలలో ఒకదానికి చెందిన సభ్యులుగా వారిని గుర్తిస్తూ కమ్యూనిటీ సర్టిఫికేట్లు జారీ చేయడానికి కూడా ఈ ఉత్తర్వు అనుమతించింది. తమిళనాడు ప్రభుత్వ భావన చట్టపరంగా మరియు భావనాత్మకంగా పూర్తిగా తప్పని మద్రాస్ హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. "ఇస్లాం మతంలోకి మారిన వ్యక్తి వెనుకబడిన తరగతి ముస్లిం హోదాను పొందలేరని మేము నిర్ధారిస్తున్నాము. మతం మారిన వ్యక్తి కేవలం ఒక ముస్లిం మాత్రమే అవుతాడు, అంతే తప్ప ప్రత్యేక వర్గానికి చెందడు" అని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ఏడు ప్రత్యేక వెనుకబడిన ముస్లిం వర్గాలలో అన్సార్, దక్కనీ ముస్లింలు, దుబేకుల, లబ్బాయి, మాపిళ్ళ, షేక్, సయ్యద్ ఎవరైనా కొత్తగా మతం మారిన వారిని సభ్యునిగా పరిగణించడం సాధ్యం కాదని, అందువల్ల వారు ఆ వర్గం కింద రిజర్వేషన్లు పొందడానికి అర్హులు కారని కోర్టు తేల్చి చెప్పింది. జూలై 2008లో జారీ చేసిన ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా తమిళనాడులోని పైన పేర్కొన్న ఏడు ముస్లిం వర్గాలను ప్రత్యేక కేటగిరీలో చేర్చారు. అయితే, ఇతర సామాజిక వర్గాల నుండి ఇస్లాంలోకి మారిన వారికి కూడా ఈ సర్టిఫికేట్లు ఇవ్వాలనే 2024 నాటి ప్రభుత్వ నిర్ణయం చెల్లదని హైకోర్టు స్పష్టం చేయడంతో తమిళనాడు ప్రభుత్వానికి దౌత్యపరంగా పెద్ద ఎదురుదెబ్బ తగిలింది.

## పాస్‌పోర్ట్, ఆధార్‌ను
# ధ్రువీకరణ పత్రాలుగా గుర్తించాలి

- కేంద్ర విదేశాంగశాఖ ప్రకటన సరైంది కాదు
- కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జూన్ 26 :** పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర విదేశాంగశాఖ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ స్పందించారు. కేంద్రం చెబుతున్న విధానం చట్టపరంగా ఒక విచిత్రమైన పరిస్థితిని సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. పాస్‌పోర్ట్ పౌరసత్వానికి రుజువు కాదని, ఆధార్ కూడా పౌరసత్వాన్ని నిర్ధరించదని చెబితే, సాధారణ భారతీయుడు తన పౌరసత్వాన్ని ఎలా నిరూపించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఆ అంశంపై ఉన్న అయోమయాన్ని తొలగించేందుకు చట్టాల్లో సవరణలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్వహించిన 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా విదేశీ ప్రయాణానికి ఉపయోగించే పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ధ్రువీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది. ఆ ప్రకటన అనంతరం సామాజిక మాధ్యమాలు, రాజకీయ వర్గాల్లో చర్చ ప్రారంభమైంది. దీనిపై శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందించిన శశి థరూర్, కేంద్రం వైఖరిని ప్రశ్నిస్తూ పోస్టు చేశారు. ఇదిలా ఉండగా, ఆధార్ కార్డుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఆయన ప్రస్తావించారు. ఆధార్ అనేది వ్యక్తి గుర్తింపు, నివాసానికి సంబంధించిన పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి ఆధారం కాదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసిందని గుర్తు చేశారు. దీంతో ప్రస్తుతం ఉన్న చట్టాల ప్రకారం కోట్లాది మంది భారతీయులు ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే ఆ వివాదానికి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఆయన కొన్ని సూచనలు కూడా చేశారు. చట్టాల్లో మార్పులు చేసి, ప్రభుత్వం రద్దు చేయనంత వరకు చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్ లేదా సాధారణ ఆధార్ కార్డును భారత పౌరసత్వానికి తుది ఆధారంగా గుర్తించాలని సూచించారు. అలాగే, భారతీయులు, నివాసితులకు ప్రత్యేక రంగు లేదా ప్రత్యేక గుర్తింపుతో ఉండే ఆధార్? కార్డులను యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా జారీ చేయాలని ప్రతిపాదించారు. ఈ విధంగా భారతీయ పౌరులు, పౌరులు కాని వారిని స్పష్టంగా వేరు చేయవచ్చని శశి థరూర్ అభిప్రాయపడ్డారు. ఆ తర్వాత సాధారణ ఆధార్ కార్డు లేదా చెల్లుబాటులో ఉన్న భారత పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ప్రభుత్వం గుర్తించవచ్చని చెప్పారు. దీంతో ఎన్నికల జాబితాల సవరణలు వంటి ప్రక్రియల్లో అనవసర వివాదాలు తగ్గుతాయని, పరిపాలనా ప్రక్రియలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. "ఈ రెండు పత్రాల్లో ఏదో ఒకటి ఉంటే భారత పౌరుడిగా గుర్తించే విధానాన్ని అమలు చేస్తే, పౌరసత్వంపై అనవసర చర్చలకు ముగింపు పడుతుంది. ప్రజలకు కూడా తమ గుర్తింపు విషయంలో పూర్తి చట్టపరమైన స్పష్టత లభిస్తుంది" అని శశి థరూర్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, విదేశాంగ మంత్రిత్వ శాఖ బుధవారం నిర్వహించిన సమావేశంలో భారత పాస్‌పోర్ట్ ప్రధానంగా ప్రయాణ పత్రం మాత్రమేనని, అది పౌరసత్వానికి తుది ఆధారం కాదని వెల్లడించింది. అనంతరం గురువారం కూడా ఆ అంశంపై మరోసారి స్పష్టత ఇచ్చింది. ఇటీవల లేదా గత 12 ఏళ్లలో పాస్‌పోర్ట్‌ను పౌరసత్వ ధ్రువీకరణ పత్రంగా ఎప్పుడూ ప్రకటించలేదని తెలిపింది. దీనికి ఆధారంగా పాస్‌పోర్ట్ చట్టం–1967లోని సెక్షన్–20ను కేంద్రం ప్రస్తావించింది. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అవసరమైతే భారత పౌరుడు కాని వ్యక్తికీ కూడా కేంద్ర ప్రభుత్వం పాస్‌పోర్ట్ లేదా ప్రయాణ పత్రాన్ని జారీ చేయవచ్చని ఆ సెక్షన్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు వెల్లడించింది. అంతేకాకుండా, 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పులను కూడా కేంద్రం ప్రస్తావించింది. కేవలం పాస్‌పోర్ట్ కలిగి ఉండటం వల్ల మాత్రమే ఒక వ్యక్తి భారత పౌరుడిగా నిర్ధారణ కాదని హైకోర్టు అప్పుడే స్పష్టం చేసిందని తెలిపింది. కేంద్రం వివరణ, శశి థరూర్ వ్యాఖ్యలతో పాస్‌పోర్ట్, ఆధార్, పౌరసత్వ ధ్రువీకరణకు సంబంధించిన అంశం ఇప్పుడు రాజకీయంగా, చట్టపరంగా మరోసారి చర్చనీయాంశంగా మారింది.

# వందేళ్లలో ఎప్పుడూ చూడని విధ్వంసం

- వెనిజులాలో శక్తివంతమైన భూకంపాలు
- రాజధాని కారకాస్‌లో భారీ విధ్వంసం
- కొనసాగుతున్న సహాయక, రెస్క్యూ చర్యలు
- అత్యవసర పరిస్థితి ప్రకటించిన ప్రభుత్వం



**కారకాస్, జూన్ 26 :** లాటిన్ అమెరికా దేశమైన వెనిజులాలో గురువారం తెల్లవారుజామున (భారత కాలమానం ప్రకారం) రెండు పవర్‌ఫుల్ భూకంపాలు పెను విధ్వంసాన్ని సృష్టించాయి. భారీగా నష్టాన్ని మిగిల్చాయి. రాజధాని కారకాస్‌తో సహా పలు ప్రాంతాల్లో భవనాలు పేకమేడల్లా కుప్ప కూలిపోవడంతో ప్రజలు శిథిలాల కింద చిక్కుకుపోయారు. ఈ ప్రకృతి విధ్వంసానికి భారీ నష్టం వాటిల్లినట్లు నివేదికలు వెలువడ్డాయి. యూఎస్ జియోలాజికల్ సర్వే ప్రకారం, గత 100 సంవత్సరాలలో వెనిజులాను తాకిన అత్యంత శక్తివంతమైన భూకంపాల్లో ఇది ఒకటిగా చెబుతోంది. ప్రాథమిక అంచనాల ప్రకారం లక్ష మంది వరకు మరణించి ఉండవచ్చు. భూకంపం తరువాత, యూఎస్ పసిఫిక్ సునామీ హెచ్చరిక కేంద్రం ప్యూర్టో రికో, యూఎస్, బ్రిటిష్ వర్జిన్ దీవులు, అరుబా, కురాకో, బొనైర్ తీరాలకు సునామీ హెచ్చరికను జారీ చేసింది. అయితే, పరిస్థితిని అంచనా వేసిన తరువాత సుమారు గంట తర్వాత ఆ హెచ్చరికను ఉపసంహరించుకున్నారు. రాజధాని కారకాస్‌లోని అల్టమీరా, చకావో ప్రాంతాలలో అనేక భవనాలు కూలిపోయినట్లు నివేదికలు వెలువడ్డాయి. సహాయక బృందాలు వెంటనే రెస్క్యూ, పునరావాస చర్యలను ప్రారంభించాయి. చకావో ప్రాంతం నుంచి కనీసం 18 మందిని సజీవంగా బయటకు తీశారు. ఫాల్కన్ రాష్ట్రంలో 22 మంది గాయపడినట్లు నిర్ధారించారు. పదిహేను మంది ఇంకా గల్లంతయ్యారు. స్థానిక అధికారులు సహాయక, గాలింపు చర్యలను కొనసాగిస్తున్నారు. తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రభుత్వం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని చెప్పారు. అత్యవసర పరిస్థితిని ప్రకటించి, అంతర్జాతీయ సహాయం కోరతామని అన్నారు. యుఎస్ జియోలాజికల్ సర్వే తన ప్రాథమిక అంచనాలో, విస్తృత ప్రాణనష్టం, అపారమైన విధ్వంసం సంభవించవచ్చని పేర్కొంది. మృతుల సంఖ్య లక్ష వరకు ఉండవచ్చని ఆ సంస్థ అంచనా వేసింది. అయితే, మొత్తం మరణాలు, గాయపడిన వారి సంఖ్యను ఇంకా అధికారికంగా విడుదల చేయలేదు. ముందస్తు జాగ్రత్త చర్యగా మైకేటియా అంతర్జాతీయ విమానాశ్రయాన్ని మూసివేశారు. పలు పాఠశాలలను మూసివేశారు. అయితే, చమురు ఉత్పత్తికి గానీ, ఇంధన మౌలిక సదుపాయాలకు గానీ పెద్ద నష్టం జరిగినట్లు నిర్ధారణ కాలేదు. వెనిజులా కరేబియన్ ప్లేట్, దక్షిణ అమెరికా ప్లేట్ కలిసే చోట ఉంది, అందువల్ల అక్కడ తరచుగా భూకంపాలు సంభవిస్తుంటాయి. ఏడాదిలో ఒకసారైనా పెద్ద భూకంపం సంభవించే ప్రమాదం ఉంది. మార్చి 26, 1812న, కారకాస్, మెరిడాలో 7.5 తీవ్రతతో భూకంపం సంభవించింది. ఆ సమయంలో వెనిజులా స్పెయిన్ నుంచి స్వాతంత్ర్యం కోసం పోరాడుతోంది. ఖూ+ూ ప్రకారం, ఈ భూకంపంలో సుమారు 30 వేల మంది మరణించారు. దేశ చరిత్రలోనే అత్యంత వినాశకరమైన భూకంపంగా దీనిని పరిగణిస్తారు. 1967 జూలై 29న కారకాస్‌లో 6.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. అనేక బహుళ అంతస్తుల భవనాలు కూలిపోయాయి. దాదాపు 200 నుంచి 300 మంది మరణించారు. దీని తర్వాత, దేశంలో భవన నిర్మాణ నిబంధనలను మరింత కఠినతరం చేశారు.

# ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రయాణికుల వ్యానును ఢీకొన్న లారీ
- ఏడుగురు అక్కడికక్కడే మృతి




**రామ్‌గఢ్, జూన్ 26 :** ఝార్ఖండ్‌లోని రామ్‌గఢ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొగ్గుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ప్రయాణికుల వ్యానును ఢీకొట్టడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడగా మెరుగైన చికిత్స కోసం రాంచీకి తరలించారు. ఈ ప్రమాదంతో ప్రాంతమంతా విషాదంలో మునిగిపోయింది. మృతులంతా బ్యాండ్, తాషా బృందానికి చెందిన కళాకారులేనని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం గురువారం అర్ధరాత్రి సమయంలో రామ్‌గఢ్ జిల్లాలోని రజరప్ప పోలీస్‌స్టేషన్ పరిధిలో లారి–బర్లాంగ్ సమీపంలోని రామ్‌గఢ్–బొకారో జాతీయ రహదారి (ఎన్‌హెచ్–23)పై జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా దెబ్బతిన్న వ్యానులో చిక్కుకున్న వారిని బయటకు తీసి రామ్‌గఢ్ సదర్ ఆస్పత్రికి తరలించారు. అయితే వారిలో ఏడుగురు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండటంతో రాంచీలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బల్సగరా ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, మారంగ్‌మర్చా గ్రామానికి చెందిన బ్యాండ్–తాషా బృంద సభ్యులు ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వ్యానులో వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మొత్తం అంతా ఒకే వాహనంలో తిరిగి బల్సగరా వైపు బయలుదేరారు. ఇదే సమయంలో రామ్‌గఢ్ వైపు నుంచి వేగంగా వస్తున్న బొగ్గు లారీ ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వచ్చిన వ్యానును ఢీకొట్టింది. లారీ ఢీకొట్టిన వేగానికి వ్యాను పూర్తిగా ధ్వంసమైంది. వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న వారంతా తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుల్లో ఆరుగురు మారంగ్‌మర్చా గ్రామానికి, ఇద్దరు బల్సగరా ప్రాంతానికి చెందిన వారిగా భావిస్తున్నప్పటికీ అధికారికంగా ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది సహాయంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రామ్‌గఢ్ సదర్ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, మొత్తం ఎనిమిది మందిని ఆస్పత్రికి తీసుకువచ్చారని, వారిలో ఏడుగురు అప్పటికే మృతి చెందారని చెప్పారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని మెరుగైన చికిత్స కోసం రాంచీకి పంపినట్లు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురీలో భద్రపరిచినట్లు వెల్లడించారు. రామ్‌గఢ్ ఎస్‌డీపీఓ ఆలోక్ రంజన్ మాట్లాడుతూ, ప్రాథమిక దర్యాప్తులో లారీ రాంగ్‌సైడ్‌లోకి వచ్చి వ్యానును ఢీకొట్టినట్లు తెలుస్తోందన్నారు. వ్యానులో బ్యాండ్–తాషా బృంద సభ్యులు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఢీకొట్టిన తీవ్రతకు వాహనం పూర్తిగా ధ్వంసమైందని, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ప్రమాదంతో మృతుల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రామ్‌గఢ్–బొకారో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో రహదారిపై రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. స్థానిక ప్రజలతో అధికారులు చర్చలు జరిపి రహదారి దిగ్బంధాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ శాశ్వత భద్రతా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న ఈ ప్రాంతాన్ని 'బ్లాక్ స్పాట్'గా గుర్తించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికుల సమాచారం ప్రకారం ఇదే ప్రాంతంలో గత నాలుగు రోజుల వ్యవధిలోనే పదిమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై వేగ నియంత్రణ చర్యలు, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ పర్యవేక్షణను పెంచాలని కోరుతున్నారు. ప్రస్తుతం ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల పూర్తి వివరాలు, ప్రమాదానికి దారితీసిన ఖచ్చితమైన కారణాలను వెలికితీసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.



## అయోధ్య విరాళాలు
# దుర్వినియోగంలో 8మంది అరెస్ట్

**న్యూఢిల్లీ, జూన్ 26 :** యోధ్యలోని రామమందిరానికి వచ్చిన విరాళాలను దుర్వినియోగం చేశారన్న ఆరోపణలపై ఎనిమిది మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు సభ్యుడు కృష్ణ మోహన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అనంతరం ఎఫ్ఐఆర్‌లో పేర్లున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి వివరాలను రాబట్టేందుకు విచారణ చేపడుతున్నారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. మరోవైపు, రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో సిట్ దర్యాప్తు అంత సంతృప్తిగా లేదని అయోధ్య ఆలయ పూజారులు అసహనం వ్యక్తం చేశారు. అయోధ్య రామాలయ విరాళాల దుర్వినియోగంపై ఏర్పాటైన సిట్ రెండు రోజుల క్రితం తమ ప్రాథమిక నివేదికను ఉత్తర్‌ప్రదేశ్ సర్కారుకు సమర్పించింది. నిందితులపై కఠినమైన చర్యలకు సిఫార్సు చేసింది. ఈ నేపథ్యంలో ఎనిమిది మందిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి, వారిని అరెస్ట్ చేశారు. ఈ అరెస్టైన వ్యక్తుల్లో శ్రీరామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్‌రాయ్ డ్రైవర్ కూడా ఉన్నాడు. "అవినాశ్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాశ్ శ్రీవాస్తవ, రామశంకర్ యాదవ్‌లపై ఎఫ్ఐఆర్‌లో నమోదైంది. వీరంతా ఆలయానికి వచ్చిన విరాళాలు, విలువైన వస్తువులను లెక్కించే ప్రక్రియలో పాలుపంచుకున్నారు. గురువారం రాత్రి ఈ ఎనిమిది మందిని అరెస్టు చేశాం. తదుపరి విచారణ కొనసాగుతోంది. నిందితులందర్నీ మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం" అని పోలీస్ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. రామమందిర విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలపై ఎనిమిది మందిపై ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో అయోధ్య పూజారులు కీలక వ్యాఖ్యలు చేశారు. కోట్లాది మంది భక్తుల నమ్మకాన్ని వమ్ము చేసిన వారికి కఠిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారాన్ని త్వరగా, పారదర్శకంగా ముగించాలని కోరుతున్నారు. సిట్ దర్యాప్తు తీరుపై ఆధ్యాత్మిక ప్రవచనకర్త కర్పత్రి మహారాజ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సిట్ దర్యాప్తుతో తాను సంతృప్తి చెందలేదన్నారు. బాధితులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కోరారు. నిందితులను అయోధ్య విడిచి వెళ్లేలా చేయాలని డిమాండ్ చేశారు. "సిట్ నివేదిక సమర్పించిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ ఎఫ్ఐఆర్‌లో ఎనిమిది మంది పేర్లు ఉన్నాయి. ఈ కేసు తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ఒకవేళ ఎవరైనా దోషులుగా తేలితే వారిపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం ఈ కేసు దర్యాప్తును వేగంగా పూర్తి చేయాలి. నిందితులపై తీసుకునే చర్యలు రాబోయే శతాబ్దాల పాటు గుర్తుండిపోవాలి" అని కర్పత్రి మహారాజ్ పేర్కొన్నారు.

# పాఠశాలలు, పిల్లలపై దాడులు ఉపేక్షించం

- దాడులు చేసేవారిని వదిలిపెట్టొద్దు
- ఐరాసలో గళమెత్తిన భారత ప్రతినిధులు



**న్యూఢిల్లీ, జూన్ 26 :** ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ప్రాంతాల్లో నలిగిపోతున్న పిల్లలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సరిహద్దుల్లో యుద్ధాలు, అంతర్గత ఘర్షణల సమయంలో పాఠశాలలు, పిల్లలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేవారిని వదిలిపెట్టొద్దని, చట్టం ముందు నిలబెట్టాలని భారత్ పేర్కొంది. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా భారత్ ఈ మేరకు స్పష్టం చేసింది. కేవలం పిల్లలకు రక్షణ కల్పించడం మాత్రమే సరిపోదని, వారిపై అఘాయిత్యాలకు ఒడిగట్టే వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించినప్పుడే ఆ రక్షణకు పూర్తి అర్థం చేకూరుతుందని నొక్కి చెప్పింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ భద్రతా మండలిలో జరిగిన "సంఘర్షణల ప్రభావితమైన పిల్లల విద్యా సంరక్షణ – నిబంధనల అమలు" అనే అంశంపై జరిగిన చర్చలో పాల్గొని ఆయన మాట్లాడారు. యుద్ధాలు, అంతర్గత కలహాల వల్ల తీవ్రంగా నష్టపోయేది భవిష్యత్తు తరమైన పిల్లలేనని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. భీకర ఘర్షణల సమయంలో కూడా విద్య అనేది పిల్లల ప్రాథమిక హక్కుగా కొనసాగాలని, దీన్ని ఏ శక్తీ హరించలేదని పర్వతనేని హరీశ్ స్పష్టం చేశారు. సమాజంలో శాశ్వత శాంతిని స్థాపించడంలో విద్య అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని, సాయుధ పోరాటాల్లో పిల్లల ప్రాణాలను కాపాడటానికి, వారి విద్యా హక్కును రక్షించడానికి భారతదేశం ఎల్లప్పుడూ అగ్రభాగాన నిలుస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. పాఠశాలలపై బాంబుల వర్షం కురిపిస్తూ, బాల్యాన్ని చిదిమేస్తున్న శక్తుల పట్ల అంతర్జాతీయ సమాజం కఠినంగా వ్యవహరించకపోతే మానవాళికే ముప్పని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా పిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, హక్కుల ఉల్లంఘనలు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అత్యంత భయంకరమైన స్థాయికి చేరుకున్నాయని భారత్ గుర్తుచేసింది. ఈ మేరకు ఇటీవల ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ సమర్పించిన నివేదికలోని గణాంకాలను ప్రస్తావించింది. ఈ నివేదికలోని గణాంకాలు అంతర్జాతీయ సమాజపు సామూహిక వైఫల్యానికి అద్దం పడుతున్నాయని విచారం వ్యక్తం చేసింది. కేవలం ఒక సంవత్సర కాలంలోనే పిల్లలపై ఏకంగా 38,558 తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని ఐరాస నివేదిక చెబుతోంది. వీటివల్ల ప్రపంచవ్యాప్తంగా 24,174 మంది పిల్లలు ప్రత్యక్షంగా నష్టపోయారు. ఇందులో 15,493 మంది బాలురు, 7,990 మంది బాలికలు ఉండగా, మిగిలిన వారి వివరాలు లభ్యం కాలేదు. ఐక్యరాజ్యసమితి ఈ రికార్డులను సేకరించడం ప్రారంభించిన తర్వాత, ఇంత భారీ సంఖ్యలో పిల్లలు హింసకు గురికావడం ఇదే మొదటిసారి. యుద్ధాలు, అంతర్గత కలహాలు జరిగే ప్రాంతాల్లో పిల్లలపై ఒకటి కంటే ఎక్కువసార్లు జరుగుతున్న దాడుల సంఖ్య కూడా ఏటా పెరిగిపోతోందని నివేదిక చెబుతోంది. యుద్ధ నిబంధనలను, అంతర్జాతీయ మానవతా చట్టాలను ఆయా పక్షాలు తుంగలో తొక్కుతున్నాయని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. అన్నింటికంటే దారుణమైన విషయం ఏమిటంటే, కేవలం ఒక్క ఏడాదిలోనే పాఠశాలలు, విద్యాసంస్థలపై జరిగిన దాడుల సంఖ్య 44 శాతం పెరిగాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 47.3 కోట్ల మంది పిల్లలు అంటే ప్రపంచంలోని ప్రతి ఆరుగురిలో ఒకరు యుద్ధ వాతావరణంలో బతుకుతున్నారు లేదా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వలసపోతున్నారని ఐరాస నివేదిక చెప్పింది. వీరిలో 8.5 కోట్ల మందికి పైగా పిల్లలకు అసలు చదువుకునే భాగ్యమే లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఇది పిల్లల భవిష్యత్తును మాత్రమే కాదని, ఆయా దేశాల భవితవ్యాన్ని కూడా నాశనం చేస్తోందని భారత్ ఆవేదన వ్యక్తం చేసింది. దురదృష్టవశాత్తూ కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ బలగాలే బాధ్యతారహితంగా ఆసుపత్రులు, పాఠశాలలపై దాడులకు కారణమవుతున్నాయని ఐరాస నివేదిక స్పష్టం చేసింది. ఈ సంక్షోభ పరిస్థితుల్లో పిల్లల రక్షణ కోసం భారత్ కొన్ని పరిష్కార మార్గాలను సూచించింది. ప్రతి దేశంలోనూ పిల్లల విద్యా హక్కును కాపాడటంలో ఆయా ప్రభుత్వాలదే ప్రాథమిక బాధ్యత అని ఐరాస వేదికపై భారత్ స్పష్టం చేసింది. ఈ విషయంలో భారత్ సాధించిన ప్రగతిని హరీష్ పర్వతనేని వివరించారు. భారతదేశంలో 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను అందించేలా 'విద్యా హక్కు'ను రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కుగా మార్చినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాలకు, పేద పిల్లలకు కూడా నాణ్యమైన విద్యను చేర్చడానికి భారత్ సాంకేతికతను అందిపుచ్చుకుందని, ఇందులో భాగంగానే దేశంలో 'దీక్ష' అనే జాతీయ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను విజయవంతంగా నడుపుతోందని చెప్పారు. కోవిడ్ మహమ్మారి సమయంలో పాఠశాలలు మూతపడినప్పుడు ఈ డిజిటల్ విద్య ఎలాగైతే కోట్ల మంది పిల్లల చదువులను కాపాడిందో, అదే విధంగా యుద్ధాలు, ఘర్షణల వల్ల దెబ్బతిన్న ప్రాంతాల్లోని పిల్లలకు విద్యను అందించడానికి డిజిటల్ లెర్నింగ్ ఒక అద్భుతమైన వంతెనలా ఉపయోగపడుతుందని భారత్ ప్రపంచానికి దిశా నిర్దేశం చేసింది. భారతదేశం కేవలం తన దేశ సరిహద్దులకే పరిమితం కాకుండా, పొరుగు దేశాలలోని శరణార్థులు, అంతర్గతంగా నిరాశ్రయులైన కుటుంబాల పిల్లల చదువుల కోసం నిరంతరం పాటుపడుతోందని హరీశ్ స్పష్టం చేశారు.

# 3 చైనా ఉత్పత్తులపై యాంటీ డంపింగ్ విచారణ




దేశీయ తయారీదార్ల ఫిర్యాదుల నేపథ్యంలో, చైనా నుంచి దిగుమతి అయ్యే మూడు ఉత్పత్తుల (థర్మల్ పేపర్, బైయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలీఅమైడ్ (బీఓపీఏ) ఫిల్మ్, కొన్ని యాంటీ యాక్సిడెంట్ల)పై యాంటీ-డంపింగ్ విచారణ ప్రారంభించినట్లు వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ దర్యాప్తులో కొరియా, సింగపూర్, అమెరికా, థాయిలాండ్ దేశాలు కూడా ఉన్నాయి. దేశీయ తయారీ రంగానికి ఇబ్బంది కలిగిస్తున్న ఈ చౌక ఉత్పత్తుల దిగుమతులపై దేశీయ సంస్థలు, వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని 'డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్' (డీజీటీఆర్)కు 4 దరఖాస్తులు అందించాయి. పాలిమర్ పరిశ్రమలో ఉపయోగించే కొన్ని యాంటీఆక్సిడెంట్లు చైనా, కొరియా, సింగపూర్ నుంచి దిగుమతి అవుతుండటంపై విచారణ జరపాలని వినతి ఆర్గానిక్స్ కోరింది. ప్యాకేజింగ్ పరిశ్రమలో ఉపయోగించే బయాక్సియల్లీ ఓరియెంటెడ్ పాలిమైడ్ (బీఓపీఏ) ఫిల్మ్ దిగుమతులు చైనా, థాయిలాండ్ నుంచి భారీగా వస్తుండటంపై విచారణ జరపాలని జేపీఎఫ్ఎల్ ఫిల్మ్స్ కోరింది. అమెరికా, చైనా, దక్షిణ కొరియా నుంచి వస్తున్న థర్మల్ పేపర్ లేదా థర్మల్ సెన్సిటివ్ పేపర్ దిగుమతులపై ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ థర్మల్ పేపర్ మానుఫ్యాక్చరర్స్ అండ్ అలైడ్ ఇండస్ట్రీస్ ఫిర్యాదు చేసింది. డెకార్ పేపర్‌పై విధించిన యాంటీ-డంపింగ్ సుంకాన్ని సన్‌సెట్ రివ్యూ చేయాలని ఐటీసీ లిమిటెడ్ కోరింది.




# ముగిసిన రెండో రోజు ఆట..

## శ్రీలంక-ఏపై భారత్‌దే ఆధిపత్యం



అనధికారిక టెస్టులో శ్రీలంక-ఏ జట్టుపై భారత్-ఏ ఆధిపత్యం కొనసాగుతోంది. రెండో రోజు ఆట ముగిసేసమయానికి శ్రీలంక 31 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసింది. భారత్ కంటే ఇంకా 339 పరుగులు వెనుకబడి ఉంది. క్రీజ్‌లో నువానిదు ఫెర్నాండో (65లి), ఆష్షేన్ బండారా (18లి) ఉన్నారు. ఓపెనర్లు పవాంత వీరసింగే (11), నిరోషన్ డిక్‌వెల్లా (10) విఫలమయ్యారు. భారత్-ఏ బౌలర్లు అన్షుల్ కాంబోజ్, యశ్ ఠాకూర్ చెరో వికెట్ తీశారు. అంతకుమందు టీమ్ఇండియా-ఏ తొలి ఇన్నింగ్స్‌ను 452/6 స్కోరు వద్ద డిక్లేర్డ్ చేసింది. తొలి రోజే సాయి సుదర్శన్ (132) సెంచరీ సాధించిన సంగతి తెలిసిందే. ఓవర్ నైట్ 333/4 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్ కాసేపటికే షేక్ రషీద్ (63) రూపంలో వికెట్ కోల్పోయింది. అయితే, కెప్టెన్ ధ్రువ్ జురెల్ (141) అద్భుత సెంచరీతో జట్టు స్కోరుబోర్డును పరుగులు పెట్టించాడు. అతడికి హర్ష్ దూబే (30) సహకారం అందించాడు. చివరి భారత్ స్కోరు 450ం దాటగానే ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తూ ధ్రువ్ నిర్ణయం తీసుకున్నాడు. శ్రీలంక బౌలర్లలో చమిక గుణశేఖర 3, దిలుమ్ సుదీరా 2, రవిందు ఫెర్నాండో ఒక వికెట్ తీశారు.



# వరంగల్ వారియర్స్ చిత్తు..

## 91 పరుగుల తేడాతో నల్గొండ ఘన విజయం

ఉప్పల్ వేదికగా టీ20 లీగ్ మ్యాచ్‌లో వరంగల్ వారియర్స్‌ను నల్గొండ నైట్స్ చిత్తు చేసింది. తొలుత బ్యాటింగ్‌లో నల్గొండ 259/5 స్కోరు చేసింది. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో వరంగల్ 14 ఓవర్లలో 168 పరుగులకు ఆలౌటైంది. దీంతో వరంగల్‌పై 91 పరుగుల తేడాతో నల్గొండ ఘన విజయం సాధించింది. కెప్టెన్ అమన్ రావు (46), మురుగన్ అభిషేక్ (44), భవేశ్ సేథ్ (22) దూకుడుగా ఆడారు. అయితే, మిగతా బ్యాటర్లలో హర్షిత్ చౌధరి (10), మణి కిరణ్ (16), అసిఫ్ (5), శౌనక్ (4), ముదాస్సర్ (5), పల్లెపాటి క్రాంతి (5) విఫలమయ్యారు. టాస్ ఓడిన నల్గొండ తొలుత బ్యాటింగ్‌కు దిగింది. నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 259 పరుగులు చేసింది. ఓపెనర్ గౌరవ్ రెడ్డి (81: 34 బంతుల్లో 4 ఫోర్లు, 7 సిక్స్‌లు), నితీశ్ రెడ్డి (81: 41 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో అదరగొట్టారు. కెప్టెన్ రాహుల్ బుద్ధి (31: 18 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అర్ఫాజ్ అహ్మద్ (33: 14 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. ఆఖర్లో దివేశ్ సింగ్ ( 18) వేగంగా పరుగులు రాబట్టాడు. వరంగల్ బౌలర్లలో అబ్దుల్ మాలిక్ 2.. ముదాస్సర్, శౌనక్ చెరో వికెట్ తీశారు.

# తొలి టీ20లో ఐర్లాండ్ విజయం



రెండు టీ20ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం భారత్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్ విజయం సాధించింది. 34 పరుగుల తేడాతో గెలుపొందింది. 182 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన భారత్ 18.5 ఓవర్లలో 148 పరుగులకు ఆలౌటైంది. అభిషేక్ శర్మ (50; 20 బంతుల్లో 7x4, 2x6) అర్ధశతకం వృథా అయ్యింది. శివమ్ దూబె (25), తిలక్ వర్మ (19), అక్షర్ పటేల్ (15) మినహా మిగతావారంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో హంఫ్రేస్, హెుల్లార్డ్ చెరో 3 వికెట్లు పడగొట్టగా.. జై మోంద్రా 2, మెక్‌కర్తీ, గరేత్ ఒక్కో వికెట్ తీశారు. అంతకు ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. లొర్కాన్ టక్కర్ (50) హాఫ్ సెంచరీ సాధించాడు. డాక్‌రెల్ (49) రాణించాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా 3, అక్షర్ పటేల్ 2, అర్ష్‌దీప్ సింగ్ 2, శివమ్ దూబే ఒక వికెట్ తీశారు.



# ఆన్‌లైన్ ట్రోలింగ్..

## మహిళా క్రీడాకారులకు ఐసీసీ అండ

ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో ట్రోలింగ్ పెరిగింది. క్రీడాకారిణులు, హీరోయిన్లపై దీని ప్రభావం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో టీ20 ప్రపంచకప్‌లో ఆడుతున్న క్రికెటర్లు ట్రోలింగ్ బారిన పడకుండా ఐసీసీ పటిష్ఠ చర్యలు చేపట్టింది. ఏఐ సంస్థ ఫ్రీడమ్2హియర్‌తో కలిసి 'ఐసీసీ ప్లేయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్'ను తీసుకొచ్చింది. ప్రత్యేక టూల్ ద్వారా.. అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న మహిళా ప్లేయర్ల సోషల్ మీడియా ఖాతాలను నిశితంగా గమనిస్తూ, వారు ట్రోలింగ్ బారిన పడకుండా చూడటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఇప్పటి వరకు క్రీడాకారులను ఇబ్బంది పెట్టేలా ఉన్న దాదాపు 60,000కు పైగా పోస్టులను తొలగించారు. 2024 మహిళల టీ20 ప్రపంచకప్ సమయంలో ఐసీసీ ఈ టూల్‌ను తీసుకొచ్చింది. కానీ, తాజా టీ20 ప్రపంచకప్ సీజన్ మొదలైన తర్వాత ప్లేయర్ ప్రొటెక్షన్ ప్రోగ్రామ్‌లో చేరిన వారి సంఖ్య అమాంతం పెరిగింది. తమను ట్రోలింగ్ నుంచి రక్షించాల్సిందిగా 50 మంది క్రికెటర్లు విజ్ఞప్తి చేసినట్లు ఐసీసీ తాజాగా వెల్లడించింది. ఇప్పటి వరకు 100 మందికి పైగా మహిళా క్రీడాకారులు ఇందులో సభ్యులుగా చేరారు. ఐసీసీ సోషల్ మీడియా ఖాతాలకు అదనపు భద్రత చేకూర్చాలనే ఉద్దేశంతో తొలుత దీనిని తీసుకొచ్చారు. కానీ, క్రీడాకారిణులపై ట్రోలింగ్ ఎక్కువవుతున్న నేపథ్యంలో.. మొత్తం 12 జట్లలో కీలకమైన 7 జట్ల సభ్యులతోపాటు, అంపైర్లు, బ్రాడ్‌క్యాస్టర్ల అధికారిక ఖాతాలకు కూడా రక్షణ కల్పిస్తున్నట్లు ఐసీసీ ప్రకటనలో పేర్కొంది. టీ20 ప్రపంచకప్ ప్రారంభమైన వారం రోజుల్లోనే ఈ టూల్ 2,50,000 కామెంట్లను రివ్యూ చేసి.. ఇబ్బందికరంగా ఉన్న 60,000 కామెంట్లను తొలగించినట్లు పేర్కొంది. ఇతరులను కించపరిచేలా తరచూ కామెంట్లు చేస్తున్న 2000 మందిని గుర్తించి వారిపై తాత్కాలిక నిషేధం విధించామని, మరో 370 మందిని బ్లాక్ చేసినట్లు పేర్కొంది. సోషల్ మీడియా మరీ ఇబ్బందికరంగా మారుతున్న తరుణంలోనే ఈ ప్రోగ్రామ్‌లో చేరాల్సి వచ్చిందని స్పిన్నర్ రాధా యాదవ్ పేర్కొంది. "స్నేహితులు, కుటుంబ సభ్యులు, అభిమానులతో సరదాగా మాట్లాడుకునేందుకు సోషల్ మీడియా అద్భుతమైన ప్లాట్‌ఫాం. కానీ, అది క్రమంగా విషపూరితమవుతోంది. ముఖ్యంగా మహిళా క్రీడాకారులను తీవ్ర ఇబ్బంది పెడుతోంది" అని తెలిపింది.

# కరీంనగర్‌పై ఖమ్మం ఏసెస్ విజయం



**హైదరాబాద్:** టీజీ20లో భాగంగా కరీంనగర్ డైమండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అన్విత ఖమ్మం ఏసెస్ జట్టు 8 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. జైస్వాల్ (64లి), హిమతేజ (56) అర్ధశతకాలతో చెలరేగారు. కృష్ణా రెడ్డి (43) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కరీంనగర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 205 పరుగులకు పరిమితం అయింది. ఆ జట్టులో సాత్విక్ రెడ్డి(63: 27 బంతుల్లో 2 ఫోర్లు, 7 సిక్స్‌లు), శుభమ్ శర్మ (54: 36 బంతుల్లో 6 ఫోర్లు, ఒక సిక్స్), చందన్ సహాని (38: 17 బంతుల్లో ఒక ఫోర్, 5 సిక్స్‌లు) చెలరేగినప్పటికీ తమ జట్టును గెలిపించలేకపోయారు. ఖమ్మం బౌలర్లలో మిలింగ్ (4/21) ఆ జట్టు పతనాన్ని శాసించాడు. సహేంద్ర మల్లు (2/55), వాఫీ కచ్చి, వేద్ రెడ్డి ఒక్కో వికెట్ తీశారు.

# డీసీ యాజమాన్య మార్పే గందరగోళం

## పంత్ వస్తాడని తెలుసు.. : ఏబీడీ



ఐపీఎల్‌లోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా ఘనత సాధించిన రిషభ్ పంత్ మళ్లీ తన పాత జట్టుకు వచ్చేశాడు. గత మెగా వేలంలో రూ. 27 కోట్లతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తీసుకుని కెప్టెన్సీ అప్పగించింది. కానీ, అతడు తన స్థాయికి తగ్గ ఆటతీరును ప్రదర్శించలేకపోయాడు. దీంతో అతడిని దిల్లీకి ట్రేడ్ చేస్తూ లఖ్‌నవూ నిర్ణయం తీసుకుంది. కొత్త డీల్‌లో భాగంగా జీతంలో భారీకోతకు అంగీకరించాడు. ఇప్పుడు దిల్లీ పంత్‌కు రూ.15 కోట్లు చెల్లించనుంది. ఈ క్రమంలో రిషభ్ పంత్ ట్రేడ్‌పై విశ్లేషించిన మాజీ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ దిల్లీ క్యాపిటల్స్ మేనేజ్‌మెంట్ మార్పుపైనా స్పందించాడు. "లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో రిషభ్ పంత్ గడిపిన సీజన్లు.. ఆ తర్వాత అతడు ఇచ్చిన కొన్ని ఇంటర్వ్యూలను చూస్తే ఇప్పుడీ ట్రేడ్ ఆశ్చర్యం కలిగించలేదు. ఎల్ఎస్‌జీపై తీవ్ర అసహనంతో ఉన్నాడని అప్పుడే సంకేతాలు కనిపించాయి. అక్కడి యాజమాన్యం, కోచింగ్ సిబ్బంది వల్ల కూడా ఇది అయి ఉండొచ్చు. ఇప్పుడు మళ్లీ దిల్లీ క్యాపిటల్స్‌కు వచ్చేశాడు" అని ఏబీడీ వెల్లడించాడు. "ఐపీఎల్‌లో ఒక జట్టు అత్యంత విజయవంతమైందంటే దానికి కారణం కేవలం ప్లేయర్లు మాత్రమే కాదు. మేనేజ్‌మెంట్ సహకారం, కోచింగ్ సిబ్బంది పాత్ర కూడా కీలకమే. కానీ, దిల్లీ క్యాపిటల్స్‌లో అదే సమస్యగా మారిందేమో అనిపించింది. ఇప్పుడు మళ్లీ సౌరభ్ గంగూలీ డైరెక్టర్‌గా వచ్చారు. యువరాజ్ సింగ్ బ్యాటింగ్ కోచ్. ఇక రిషభ్ పంత్ కూడా జట్టులోకి వచ్చేశాడు. మరి ఇవి జట్టు ప్రదర్శనపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో చూడాలి. అయితే యాజమాన్యంలో మార్పు, కోచింగ్ సిబ్బంది వస్తూ పోతూ ఉండటం కచ్చితంగా గందరగోళం సృష్టిస్తుంది. ఈ మార్పులను సానుకూల దృక్పథంతో తీసుకొని పరిస్థితులకు అలవాటు పడటం ఆటగాళ్లకు కష్టంగా మారే అవకాశం లేకపోలేదు" అని ఏబీడీ విశ్లేషించాడు. గత రెండేళ్లు జీఎంఆర్ నిర్ణయాలు తీసుకోగా.. ఇప్పుడు జేఎస్‌డబ్ల్యూ ఆ స్థానంలోకి వచ్చింది. ఈ రెండు సంస్థలు ఉమ్మడిగానే దిల్లీ క్యాపిటల్స్‌ను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.



# ఆసియా మార్కెట్ల భారీ పతనం

ఆసియా స్టాక్ మార్కెట్లు నేడు భారీగా కుప్పకూలాయి. అమెరికా మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో భారీగా పతనమయ్యాయి. దక్షిణ కొరియా బెంచ్ మార్కెట్ ఇండెక్స్ కోస్పీ ఏకంగా 8 శాతం మేర పతనం కాగా.. జపాన్‌కు చెందిన నిక్కీ 5 శాతం మేర క్షీణించింది. టెక్ స్టాక్స్‌లో అమ్మకాలు ఈ పతనానికి కారణమయ్యాయి. నేడు మన మార్కెట్‌లకు సెలవు కావడం గమనార్హం. గిఫ్ట్ నిఫ్టీ మాత్రం శుక్రవారం ఉదయం 100 పాయింట్ల మేర క్షీణించింది. శుక్రవారం నాటి ట్రేడింగ్ సెషనల్‌లో కోస్పీ దాదాపు 8.2 శాతం మేర పతనమైంది. దీంతో ట్రేడింగ్‌ను 20 నిమిషాల పాటు నిలిపివేశారు. అటు జపాన్ నిక్కీ సైతం 5 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.4 శాతం, చైనా బ్లూచిప్ సీఎస్ఐ300 ఇండెక్స్ 2.9 శాతం, షాంఘై కాంపోజిట్ సైతం 2 శాతం మేర క్షీణించాయి. జూన్ 23న కూడా ఇదే తరహాలో ఆసియా మార్కెట్‌లో అమ్మకాలు కనిపించాయి. నేడు మళ్లీ అదే స్థాయిలో మార్కెట్లు పడిపోయాయి. మెమొరీ, స్టోరేజీ చిప్‌ల ధరల కారణంగా యాపిల్ తన ఐప్యాడ్, మ్యాక్‌బుక్ ధరలను భారీగా పెంచిన సంగతి తెలిసిందే. దీంతో ఏఐ మౌలిక వసతుల కల్పనపై చేస్తున్న ఖర్చు, పెరుగుతున్న సెమీ కండక్టర్ల ధరలు బిగ్ టెక్ కంపెనీలనూ వదలడం లేదన్న సంకేతాలను పంపింది. దీంతో యాపిల్ షేరు విలువ నిన్న ఒక్కరోజే 6.1 శాతం మేర క్షీణించింది. 25 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ ఆవిరైంది. ఎన్విడియా, మైక్రోసాఫ్ట్, అల్ఫాబెట్ షేర్లు కూడా పతనమయ్యాయి. ఈ ఉదంతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మౌలిక సదుపాయాల కోసం భారీగా అప్పులు చేసి పెడుతున్న పెట్టుబడులు దీర్ఘకాలంలో స్థిరంగా కొనసాగుతా యా లేదా అనే అనుమానాలను ఇన్వెస్టర్లలో నెలకొల్పింది. ఏఐ పెట్టుబడులపై ఆలోచనలో పడేసింది. ఈ క్రమంలోనే చైనాకు చెందిన సీఎస్ఐ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇండెక్స్ 5 శాతం, సీఎస్ఐ 5జీ కమ్యూనికేషన్ ఇండెక్స్ 6.3 శాతం, హాంగ్ సెంగ్ టెక్ ఇండెక్స్ 3.3 శాతం చొప్పున క్షీణించాయి.



# పెయిడ్ సర్వీస్‌గా వాట్సాప్ ప్లస్

వాట్సాప్ వినియోగదారుల కోసం మెటా సంస్థ 'వాట్సాప్ ప్లస్' పేరిట పెయిడ్ సర్వీసెస్‌ను అందుబాటులోకి తెచ్చింది. నెలకు రూ.79తో ఈ సేవలు పొందొచ్చు. మొదటి నెల రోజులు ఉచితంగా ట్రై చేయొచ్చు కూడా. 'వాట్సప్ ప్లస్' కోసం ఇప్పటికే ఉన్న యాప్ సెటింగ్స్‌లోకి వెళ్లి సబ్‌స్క్రిప్షన్స్ విభాగాన్ని ఎంపిక చేసుకోవాలి. అక్కడ 'వాట్సప్ ప్లస్' కనిపిస్తుంది. అప్‌గ్రేడ్ యువర్ మెసేజింగ్ ఎక్స్‌పీరియన్స్‌పై క్లిక్ చేస్తే తొలుత నెల రోజుల పాటు ఫ్రీ ట్రయల్.. ఆ తర్వాత పెయిడ్ సర్వీసెస్ పొందొచ్చు. ప్రస్తుతం వాట్సప్‌లో 3 చాట్‌ల వరకే పిన్ చేసుకునే అవకాశముంది. వాట్సప్ ప్లస్‌లో 20 చాట్‌ల వరకూ పిన్ చేసుకోవచ్చు. వేల మెసేజ్‌లు వచ్చినా సరే.. మనకు కావాల్సిన ముఖ్యమైన 20 చాట్స్ స్క్రీన్‌పై టాప్‌లో కనిపిస్తాయి. హోమ్ స్క్రీన్‌పై ఉండే వాట్సప్ లోగో గ్రీన్ కలర్‌కు బదులుగా నచ్చిన రంగులోకి మార్చుకోవచ్చు. చాట్ లోపల ఉండే టెక్ట్స్ బబుల్స్, మెసేజ్ టిక్స్, బ్యాక్‌గ్రౌండ్ వాల్‌పేపర్స్ అన్నీ మనం ఎంపిక చేసుకునే థీమ్ రంగులోకి మారిపోతాయి. రాయల్ పర్పుల్, వెల్వెట్ రెడ్, సైబర్ పంక్ బ్లూ లాంటి ప్రీమియం కలర్స్ దీనిలో అందుబాటులో ఉంటాయి. చాట్ లిస్ట్‌ను అప్‌గ్రేడ్, కస్టమ్ లిస్ట్ క్రియేట్ చేసుకోవడం, కావాల్సిన థీమ్, రింగ్‌టోన్, నోటిఫికేషన్ టోన్ సెట్ చేసుకోవచ్చు. యానిమేషన్‌తో కూడిన ప్రత్యేక స్టిక్కర్లు పంపించొచ్చు. ప్రత్యేక రింగ్‌టోన్‌లు పొందొచ్చు. సేవలు వద్దనుకునేవారు.. ఎప్పుడైనా సబ్‌స్క్రిప్షన్ రద్దు చేసుకోవచ్చు.

# 'సెక్షన్ 301' దర్యాప్తు పూర్తయితే.. పాత స్థాయిలో అమెరికా టారిఫ్‌లు



సుంకాలపై అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కీలక ప్రకటన చేశారు. ప్రస్తుతం అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం సెక్షన్ 301పై చేస్తున్న దర్యాప్తు పూర్తయితే.. తిరిగి పాత స్థాయిలో ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే సెక్షన్ 122 కింద విధించిన 10 శాతం టారిఫ్‌లు జులై 24 వరకు ప్రపంచవ్యాప్తంగా అమల్లో ఉండనున్నాయి. వెట్టిచాకిరి నిర్మూలనలో విఫలమైనందుకు గానూ భారత్ సహా 50కి పైగా దేశాల దిగుమతులపై అదనంగా 12.5 శాతం సుంకం విధించాలని అమెరికా వాణిజ్య కార్యాలయం తన మధ్యంతర నివేదికలో ప్రతిపాదించింది. వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రపంచ దేశాలపై పరస్పర సుంకాలు ఉపయోగించారని స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు. సెక్షన్ 301 ప్రక్రియ కూడా అదే విధమైన లక్ష్యాన్ని సాధించడానికి చేపట్టినట్లు తెలిపారు. భారత్- అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగుతున్న తరుణంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరో వైపు లండన్‌లో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. ఇతర దేశాలపై ప్రయోజనాలను పొందినప్పుడే భారత్ ఒప్పందం విషయంలో ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు.

### ఏమిటీ సెక్షన్ 301

ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న శక్తిమంతమైన ఆయుధమే ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు.. అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది.

జనం వార్త




## మా ఇంటి బంగారం కోసం
# సమంతను ఒప్పించా : రాజ్



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకుపోతోంది. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, థ్రిల్లింగ్ అంశాల మేళవింపుతో తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల నుంచి అద్భుతమైన స్పందనను అందుకుంటోంది. విడుదలైన తొలి వారం రోజుల్లోనే భారీ వసూళ్లు సాధించిన ఈ సినిమా ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ విజయాన్ని సెలబ్రేట్ చేసేందుకు హైదరాబాద్‌లో నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నిర్మాత, దర్శకుడు రాజ్ నిడిమోరు చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సమంత వ్యక్తిగత జీవితం, కెరీర్, ఈ సినిమా ప్రయాణం గురించి ఆయన పంచుకున్న విషయాలు అందరినీ భావోద్వేగానికి గురిచేశాయి. మేము ఎన్నో హిందీ ప్రాజెక్టులు చేశాం. 'ది ఫ్యామిలీ మ్యాన్', 'స్త్రీ' వంటి ప్రాజెక్టులు దేశవ్యాప్తంగా బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. కానీ 'మా ఇంటి బంగారం' ఇచ్చిన తృప్తి మాత్రం పూర్తిగా భిన్నం. ఈ సినిమా నాకు గుండెకు చాలా దగ్గరైంది. తెలుగు ప్రేక్షకులు చూపించిన ప్రేమ, ఆదరణ నాకు జీవితాంతం గుర్తుండిపోతుంది' అని రాజ్ చెప్పారు. సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన సవాళ్లను గుర్తు చేసుకున్న రాజ్, ఒక ఆసక్తికర విషయాన్ని కూడా వెల్లడించారు. ఈ సినిమా ప్రారంభమైన సమయంలో సమంత వ్యక్తిగత జీవితం, ఆరోగ్యంపై బయట ఎన్నో రకాల ప్రచారాలు జరిగాయి. ఆ సమయంలో ఆమె సినిమాలకు దూరంగా ఉండాలనే ఆలోచనలో ఉండేది. నిజానికి ఇక సినిమాలు చేయకూడదని కూడా అనుకుంది. అయితే కనీసం ఈ ఒక్క సినిమా అయినా చేయాలని నేనే బలవంతం చేసి ఒప్పించాను అని రాజ్ వెల్లడించారు.

## మరో మూడు నెలల్లో
# వారణాసి పూర్తి
### ముఖ్యమైన షూటింగ్ పూరి చేశామన్న జక్కన్న



మహేశ్ బాబు, ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పాన్ వరల్డ్ ప్రాజెక్ట్ 'వారణాసి' సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ సినీ అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతోంది. ఈ చిత్ర షూటింగ్ మరో నాలుగు నెలల్లో, అంటే ఈ ఏడాది సెప్టెంబర్ లేదా అక్టోబర్ మొదటి వారానికల్లా పూర్తిగా ముగియనుందని దర్శకుడు రాజమౌళి స్వయంగా వెల్లడించారు. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన 'ఆన్సీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫెస్టివల్'లో పాల్గొన్న ఆయన ఒక అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలను పంచుకున్నారు. సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవబోయే భారీ యాక్షన్ సీక్వెన్స్‌ల చిత్రీకరణతో పాటు వారణాసిలోని ముఖ్యమైన భాగాల షూటింగ్ కూడా ఇప్పటికే విజయవంతంగా పూర్తయిందని, ప్రస్తుతం కేవలం కథను అనుసంధానం చేసే చిన్న చిన్న సన్నివేశాలను మాత్రమే తెరకెక్కిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించడంపై రాజమౌళి ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ కథ ఐమాక్స్ స్క్రీన్‌పై చూస్తేనే అద్భుతమైన అనుభూతిని ఇస్తుందని తాము ముందుగానే భావించామని, అయితే ఈ ఫార్మాట్ కోసం కథలో ఎలాంటి ప్రధాన మార్పులు చేయలేదని కేవలం సాంకేతిక పరమైన సర్దుబాట్లు మాత్రమే చేశామని తెలిపారు. సాధారణంగా మన కళ్లు సినిమా స్కోప్ ఫార్మాట్‌కు అలవాటు పడ్డాయని, అందువల్ల అటు ఐమాక్స్, ఇటు సినిమా స్కోప్ రెండింటికీ సరిపోయేలా 'అనోమార్ఫిక్ ఫ్రేమింగ్' పద్ధతిని ఉపయోగించి దృశ్యాలను చిత్రీకరించినట్లు వివరించారు. దీనికోసం ప్రారంభంలో కొన్ని ఇబ్బందులు ఎదురైనప్పటికీ, ఆ తర్వాత పని చాలా సులభంగా సాగిపోయిందని జక్కన్న చెప్పుకొచ్చారు. ఇక గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కథానాయికగా నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది.

# స్టైలిష్ లుక్‌లో రితిక నాయక్

యంగ్ హీరోయిన్ రితిక నాయక్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. విశ్వక్ సేన్ హీరోగా తెరకెక్కిన 'అశోక వనంలో అర్జున కల్యాణం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ భామ, ఆ తర్వాత 'హాయ్ నాన్న' చిత్రంలో చిన్న పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. ఇటీవల విడుదలైన 'మిరాయ్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రితిక, ప్రస్తుతం వరుణ్ తేజ్ హీరోగా తెరకెక్కుతున్న 'కొరియన్ కనకరాజు' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. ఇలా వరుస అవకాశాలతో కెరీర్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తోంది. సినిమాల్లో ఇప్పటివరకు గ్లామర్ షోకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వని రితిక నాయక్, సోషల్ మీడియాలో మాత్రం అప్పుడప్పుడు తన స్టైలిష్ ఫొటోషూట్లతో అభిమానులను అలరిస్తూ ఉంటుంది. తాజాగా ఆమెకు సంబంధించిన కొన్ని ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఫొటోల్లో రితిక బ్లూ బార్డర్ ఉన్న రెడ్ చీరతో పాటు బ్లూ స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి ఎంతో స్టైలిష్‌గా పోజులిచ్చింది. చెవులకు పెద్ద ఇయర్‌రింగ్స్, చేతికి గాజులు ధరించి, జుట్టును సర్దుకుంటూ ఇచ్చిన స్టిల్స్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఈ ఫొటోల్లో ఆమె నాజూకైన నడుము అందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.



# కష్టాలు వచ్చినప్పుడు అస్సలు భయపడకూడదు

బాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ త్రిప్తి దిమ్రి ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ ఫామ్‌లో దూసుకుపోతున్నారు. 'యానిమల్' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిన త్రిప్తి ఇప్పటికీ అదే క్రేజ్‌తో ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూనే.. సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్నారు. ప్రస్తుతం త్రిప్తి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ సరసన 'స్పిరిట్' చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న త్రిప్తి.. సినిమా ఇండస్ట్రీలో ఒక నటిగా ఉండటంలో ఉండే లాభాలు ఏంటి? నష్టాలు ఏంటి? అనే ప్రశ్నపై స్పందిస్తూ.. "ఒక నటిగా నేను చేసే ఒక్కో క్యారెక్టర్ ద్వారా ఒక్కో కొత్త జీవితాన్ని జీవించే అవకాశం నాకు దొరుకుతుంది. నిజ జీవితంలో మనం చేయలేని ఎన్నో విషయాలను, ఎమోషన్స్‌ను కెమెరా ముందు పాత్రల ద్వారా అనుభవించవచ్చు. ప్రతి కొత్త ప్రాజెక్ట్ మనకు లైఫ్‌లో ఏదో ఒక కొత్త విషయాన్ని నేర్పిస్తుంది" అని త్రిప్తి ఆనందం వ్యక్తం చేశారు. అలాగే కెరీర్‌లో ఎదురయ్యే ఫెయిల్యూర్స్ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయనే విషయంపై త్రిప్తి స్పందిస్తూ.. "కచ్చితంగా కెరీర్‌లో చాలా కష్టమైన రోజులు వస్తాయి. మనం ఒకటి ఆశిస్తే ఇండస్ట్రీలో ఇంకొకటి జరుగుతుంది. అలాంటప్పుడు మన సామర్థ్యంపై మనకే అనుమానం రావడం చాలా కామన్. కానీ, ఆ కష్ట కాలమే మనకు ఓపికను, మనపై మనకు నమ్మకాన్ని నేర్పిస్తుంది. వెనక్కి తిరిగి చూసుకుంటే.. నన్ను ఒక స్ట్రాంగ్ పర్సన్‌గా మార్చడానికి ఆ ఫెయిల్యూర్స్ ఎంతగానో హెల్ప్ చేశాయి. అందుకే నేను అందరికీ ఒకటే చెప్తాను.. కష్టాలు వచ్చినప్పుడు అస్సలు భయపడకుండా, తలదించుకుని మన పని మనం సిన్సియర్‌గా చేసుకుంటూ పోవాలి. అదే మనల్ని సక్సెస్ వైపు నడిపిస్తుంది" అంటూ త్రిప్తి దిమ్రి క్లారిటీ ఇచ్చారు.



# దీవానా సినిమా సూపర్బ్ అన్న శ్రీవిష్ణు
### నేడు ఒకటి కొంటే రెండు టిక్కెట్ల ఆఫర్

టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఇటీవల విడుదలైన చిన్న చిత్రం 'దీవాన' పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సినిమా సక్సెస్ సాధించిన నేపథ్యంలో చిత్రబృందం తాజాగా 'థ్యాంక్యూ మీట్' నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు ప్రేక్షకులకు ఒక బంపర్ ఆఫర్ ప్రకటించి సర్‌ప్రైజ్ చేశారు. 'దీవాన' సినిమా తనకు విపరీతంగా నచ్చేసిందని పేర్కొన్న శ్రీవిష్ణు.. ఈ చిత్రాన్ని మరింత మంది ప్రేక్షకులకు చేరువ చేసేందుకు ఒక క్రేజీ అనౌన్స్‌మెంట్ చేశారు. శనివారం ఈ సినిమా ప్రదర్శితమవుతున్న ప్రతి థియేటర్‌లోనూ, మొదటి 25 టికెట్లకు గానూ ఒకటి కొంటే మరొకటి ఉచితం ఆఫర్‌ను వర్తింపజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ వినూత్న ఆఫర్ వల్ల సినిమాకు మౌత్ పబ్లిసిటీ మరింత పెరిగి, థియేటర్లలో లాంగ్ రన్ లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీవిష్ణు సినిమాపై తనకున్న ఫీలింగ్స్‌ను పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'నాతో 'సింగిల్' చిత్రాన్ని నిర్మించిన లేడీ ప్రొడ్యూసర్ విద్య కొప్పినీడి కోరడంతో నిన్న ఈ సినిమా ఫస్ట్ హాఫ్ చూశాను. అయితే ఇంటర్వెల్‌లో వచ్చిన ట్విస్ట్‌కి నాకు ఒక్కసారిగా చిప్ ఎగిరిపోయింది. దాంతో మిగతా పనులన్నీ పక్కన పెట్టేసి మరీ సెకండ్ హాఫ్ కూడా పూర్తిగా చూశాను' అని శ్రీవిష్ణు నవ్వుతూ వెల్లడించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడి ప్రతిభను, నటీనటుల నటనను శ్రీవిష్ణు మనస్ఫూర్తిగా అభినందించారు. దర్శకుడికి ఎంత టాలెంట్ ఉందో, దానికి తగ్గట్టుగానే అద్భుతమైన టెక్నీషియన్స్, ఆర్టిస్టులు దొరకడం వల్లే సినిమా ఇంత బాగా వచ్చిందని కొనియాడారు.

# రణబాలి షూటింగ్‌లో విజయ్ గొంతెమ్మ కోర్కెలు
### సోషల్ మీడియా అసత్య ప్రచారాలను తిప్పికొట్టిన నిర్మాత




టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రస్తుతం వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా ఆయన నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఇటీవల ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో పలు వార్తలు వైరల్‌గా మారాయి. 'రణబాలి' చిత్రీకరణ సమయంలో విజయ్ దేవరకొండ ఐదు కారవాన్లు ఏర్పాటు చేయాలని కోరారని, తన వెంట పెద్ద సంఖ్యలో అసిస్టెంట్లు ఉండాలని డిమాండ్ చేశారనే ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ వార్తలు అభిమానుల్లో చర్చకు దారితీశాయి. ఈ ప్రచారంపై ఇప్పటికే విజయ్ దేవరకొండ బృందం స్పందించింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని స్పష్టం చేసింది. హీరోపై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోందని పేర్కొంది. అసత్య కథనాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమని విజయ్ టీమ్ హెచ్చరించింది. తాజాగా ఈ వివాదంపై చిత్ర నిర్మాత రవి కూడా స్పందించారు. షూటింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదని, విజయ్ దేవరకొండ నుంచి అసాధారణమైన డిమాండ్లు ఏవీ రాలేదని ఆయన స్పష్టం చేశారు. విజయ్ ఎప్పుడూ పనిపట్ల నిబద్ధతతో వ్యవహరిస్తారని, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తారని నిర్మాత తెలిపారు. ఆయనపై వస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని తేల్చిచెప్పారు. ఇక 'రణబాలి' సినిమా విషయానికి వస్తే, ఈ చిత్రంలో విజయ్ దేవరకొండ సరసన రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తున్నారు. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను తెరకెక్కిస్తున్నారు. పీరియడ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి బజ్ ఏర్పడింది. సినీ వర్గాల సమాచారం ప్రకారం 'రణబాలి' చిత్రీకరణ దాదాపు 90 శాతం పూర్తయింది. మిగిలిన భాగాన్ని వేగంగా పూర్తి చేసి సినిమాను సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.


PUBLISHED AND OWNED BY DUSARI KASTURI, PRINTER B SANDHYA RANI PRINTED AT M/S.KAKATIYA PRINTERS 2-24-96/9, NEAR SRI KRISHNA PHARMA, LAXMINARAYANA NAGAR, IDA UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500039, PUBLISHED AT H.NO. 9-875/104/3A, BAPUJI COLONY, NEAR VIJAYA HOSPITAL NAGARAM , MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500083..EDITOR : DUSARI RAVINDER GOUD, PRGI REGISTRATION NUMBER TGTEL/25/A1132, CELL :8522055889 MAIL ID:dusari kasturi9@gmail.com